విలేకరులు కావలెను

TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
R N I No. APTEL/2012/53127

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును

9703247143

TELANGANA VANI TELUGU DAILY

తెలంగాణ వాణి

R N I No. APTEL/2012/53127

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA

ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 213 | ఆదివారం 11.10. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00

విద్యుత్ ఆధారిత పనులను తాత్కాలికంగా వాయిదా

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- వచ్చే ఏడాది జూన్ వరకు సాగు, తాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యలపై సరైన యాక్షన్ ప్లాన్
- ఎల్‌నినో పరిస్థితులపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష
- పలు అంశాలపై వారికి దిశానిర్దేశం
- విద్యుత్ సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం పొంచి ఉంది
- విద్యుత్ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధం
- అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉంది.
- తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యల విషయంలో సరైన యాక్షన్ ప్లాన్
- సమస్యలను ఎదుర్కోవడానికి అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు



హైదరాబాద్ తెలంగాణ వాణి)

ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో అంతర్జాతీయ స్థాయిలో సంక్షోభ పరిస్థితులు తలెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో తక్షణ చర్యలకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి . రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులపై జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తులో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సిన ప్రమాదం పొంచి ఉండటంతో చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యల విషయంలో సరైన యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాబోయే సంక్షోభాన్ని ముందుగా గుర్తించకపోతే భవిష్యత్తులో తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. సమస్యలను ఎదుర్కోవడానికి అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రాబోయే 8 నెలలు ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో కీలకమని ముఖ్యమంత్రి గారు అభిప్రాయపడ్డారు. ఈ 8 నెలల పాటు ప్రతి కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు పకడ్బందీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. రాబోయే రోజుల్లో విద్యుత్ సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం



ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని, అయితే మార్కెట్‌లో విద్యుత్ అందుబాటులో లేదని తెలిపారు. అందుకే అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైనంత మేరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఎల్‌నినో ప్రభావంపై గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సినిమా, మీడియా, కళాజాతాలతో పాటు వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

రైతులు వేసిన పంటల పరిస్థితులను అంచనా వేసి, పంట చేతికొచ్చే వరకు నీటి కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. భవిష్యత్తులో నీటి సమస్య తీవ్రతరం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, చుక్క నీరు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశంలో చర్చించనున్నట్లు ముఖ్యమంత్రి గారు తెలిపారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెప్పారు.

రాష్ట్రంలో దాదాపు 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్న నేపథ్యంలో, కరువు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసిందని, రూ. 20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరిందని గుర్తుచేశారు.

VB-G RAM G పథకంలో భాగంగా 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలని కేంద్రాన్ని కోరాలని అధికారులకు సూచించారు. అదనపు పని దినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

అవసరమైతే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసే అంశాన్ని మంత్రుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. దసరా తర్వాత గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు.


ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించేందుకు వార్‌రూమ్‌ను ఏర్పాటు చేయాలని, టోల్-ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాను సీఎండీ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.

అట్టహాసంగా ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు

- రవీంద్రభారతిలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు
- హాజరైన మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్
- బతుకమ్మ పాటలతో మార్మోగిన ప్రాంగణం
- రంగురంగుల పూలు పేర్చి.. మహిళల ఆటపాటలు



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు రవీంద్రభారతిలో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలకు వందలాది మంది మహిళలు తరలివచ్చారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. బతుకమ్మ పాటలతో రవీంద్రభారతి ప్రాంగణం మార్మోగింది. ప్రారంభ వేడుకలకు మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు ఆడబిడ్డలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి ప్రసాదించిన పూలను దేవతగా కొలిచే అపురూపమైన పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల సామూహిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ఐక్యతా భావానికి ఈ పండుగ నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని, ప్రతి ఒక్కరూ ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని మంత్రులు ఆకాంక్షించారు. తెలంగాణ సుభిక్షంగా వర్ధిల్లాలని, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడంతోపాటు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.



నోయిడా ఎయిర్ పోర్టుకు మోదీ పేరు

యోగి సర్కారు కీలక నిర్ణయం!

పేరుమార్పు తీర్మానానికి యోగి మంత్రివర్గం ఆమోదం

ఉత్తర్‌ప్రదేశ్, అక్టోబర్ 09: ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో ఉన్న జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును మార్చాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై ఈ విమానాశ్రయాన్ని మిగతా 2లో..



అన్నింటి కన్నా డెమోక్రసీ గొప్ప

ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది

అధికారంలో ఉన్నోళ్లకు ఈసీ రక్షణ కవచం కావద్దు

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

హరీష్ రావు

02

ఆర్ఆర్ఆర్‌తో విశ్వనగరంగా ఖ్యాతి

పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణ

గ్లోబల్ సమ్మిట్ తలపించేలా ఐఆర్ సీ

తెలంగాణ ఖ్యాతి చాటేలా...ఐఆర్ సీ

నవంబర్ 19 నుంచి 22 వరకు 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్

3 వేల మంది డెలిగేట్స్, 400 ఎగ్జిబిషన్ స్టాళ్లతో, హైటెక్స్‌లో 4 రోజులు జాతీయ స్థాయి సదస్సు

ముఖ్య అతిథులుగా సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో 25వేల కోట్లతో రాష్ట్రంలో నాణ్యమైన రోడ్లు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



దేశ అభివృద్ధికి ఎంఎస్ఎంఈలే బలమైన స్తంభాలు : కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

ఎంఎస్ఎంఈలు కేవలం పరిశ్రమలు మాత్రమే కావని.. దేశ పారిశ్రామిక రంగానికి బలమైన స్తంభాలని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ తాజ్ డెక్కన్‌లో నిర్వహించిన 'లఘు ఉద్యోగ్ భారతీ-సౌత్ ఇండియా కాంక్లేవ్'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధనలో, దేశంలో ఉద్యోగ కల్పనలో ఎంఎస్ ఎంఈలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. దేశ జీడీపీలో 32 శాతం, తయారీ రంగంలో 36 శాతం, ఎగుమతుల్లో 49 శాతం వాటా ఎంఎస్ఎంఈలదేనని పేర్కొన్నారు. ఉద్యమ్ ప్లాట్‌ఫామ్‌పై నమోదు చేసుకున్న 9.80 కోట్ల ఎంఎస్ఎంఈల ద్వారా 40 కోట్లకు పైగా ప్రజలకు ఉపాధి లభిస్తోందని, వీటిలో 37 శాతం మహిళా యాజమాన్యంలో నడుస్తున్నాయని వివరించారు.



ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలకు త్వరితగతిన అనుమతులు, ఆర్థిక సాయం, పన్ను రాయితీలు అందిస్తున్నట్లు చెప్పారు. క్రెడిట్ గ్యారంటీ ఫండ్, పీఎం విశ్వకర్మ, ముద్ర, జెమ్ వంటి పథకాల ద్వారా రుణ సౌకర్యం, మార్కెట్ తోడ్పాటు అందిస్తున్నామన్నారు. ఆవిష్కరణలు, నూతన సాంకేతికత ఉన్న సంస్థలకు దీర్ఘకాలిక ఈక్విటీ మూలధనం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, బ్యాంకులు కూడా చిన్న వ్యాపారులకు అవసరమైన ఆర్థిక సాయం అందించాలని కోరారు. 2014 తర్వాత దేశం అన్ని రంగాల్లో వేగంగా విస్తరించిందని, విదేశీ పెట్టుబడులకు భారత్ స్వర్గధామంగా మారిందని అన్నారు. తొలిసారిగా 1 బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించామని, విద్యుత్ కోతలు లేని నయా భారత్‌ను నిర్మించామని తెలిపారు. భారత్ ఆర్థికంగా బలోపేతమవుతుంటే ప్రతిపక్షాలు, కొన్ని అంతర్జాతీయ శక్తులు ఓర్వలేక దేశ పరువు తీసేలా వ్యవహరిస్తున్నాయని, ఇది యువత ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

రీ సర్వేతోనే భూ సమస్యలకు చెక్

భూ వివాద రహిత తెలంగాణే లక్ష్యం

ఏడాదిన్నరలో సమగ్ర భూసర్వే పూర్తి చేస్తాం

సర్వే పర్యవేక్షణకు 7 జోన్లకు 14 మంది అధికారులు

నాణ్యత పారదర్శకత వేగం

రీ-సర్వేలో అత్యంత కీలకం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్ తెలంగాణ వాణి) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భూ వివాదాలు లేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమగ్ర రీ--సర్వేను మిగతా 2లో..

కరువు నుంచి గట్టెక్కించాలి

నివేదికలు సిద్ధం చేయాలి


ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



హైదరాబాద్ తెలంగాణ వాణి) ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న వర్షపాతం లోటు పరిస్థితులను సమీక్షించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేసి, కరువు ప్రభావిత మండలాలపై ప్రాథమిక నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.సోమవారం ముఖ్యమంత్రి మిగతా 2లో..

ఎస్ఐఆర్ ప్రక్రియపై పచ్చి అబద్ధాలు

హైదరాబాద్ తెలంగాణ వాణి)



ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పచ్చి అబద్ధాలతో ఫాల్స్ నెరేటివ్ సృష్టిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మండిపడ్డారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా బోగస్ ఓట్లను తొలగిస్తే, కాంగ్రెస్ నాయకులు రాజ్యాంగ సంస్థలపై బురదజల్లుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రపతిని కలిసిన అనంతరం కూడా రాహుల్ గాంధీ ఎలాంటి ఆధారాలు లేకుండానే ఓట్ చోరీ జరిగిందంటూ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.డిలీట్ అయిన ఒక్క ఓటరును అయినా సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ దమ్ముంటే ప్రజల ముందుకు తీసుకురావాలని రాంచందర్ రావు సవాల్ విసిరారు. దేశంలో ఎమర్జెన్సీ విధించడం, బూత్ క్యాప్చరింగ్‌లు, ఎంపీలను కొని ఓట్లు వేయించుకున్న చరిత్ర కాంగ్రెస్‌దేనని గుర్తుచేశారు.

సృజనాత్మక ఆలోచనలకు ప్రభుత్వ ప్రోత్సాహం : మంత్రి శ్రీధర్ బాబు

సమాజానికి ఉపయోగపడే సృజనాత్మక ఆలోచనలతో ముందుకొచ్చే ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. కీర్తన అకాడమీ ఆఫ్ మ్యూజిక్, ప్రముఖ నేపథ్య గాయకుడు నేమాని పార్థ ఆధ్వర్యంలో రూపొందించిన భాగవతామృతం మొదటి సంచికను శనివారం బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో మంత్రి లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సాంకేతికత పెరుగుతున్న కొద్దీ నైతిక విలువలు, సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక,



సాంస్కృతిక వారసత్వాన్ని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భాగవత పద్యాలను, వాటి అంతరార్థాన్ని సులభంగా అర్థమయ్యేలా ఆహ్లాదకరమైన సంగీతం, దృశ్యరూపకంతో అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు.

రేడియల్ రోడ్ల టెండర్లను వెంటనే రద్దు చేయండి: కేటీఆర్



హైదరాబాద్: రేడియల్ రోడ్ల టెండర్లలో జరిగిన కుంభకోణంపై సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. పనుల్ని ప్యాకేజీలుగా ముక్కలుగా చేసి, నచ్చిన వారికే కట్టబెట్టారని ఆరోపించారు. అక్రమంగా కట్టబెట్టిన టెండర్లలో రూ.వందల కోట్ల అవినీతి జరిగిందని ఆక్షేపించారు. వెంటనే టెండర్లను రద్దు చేసి అక్రమాలపై విచారణ జరపాలన్నారు. ఈ మేరకు సీఎంకు లేఖ రాశారు.“ రేడియల్ రోడ్ల టెండర్ల రికార్డులను బహిర్గతం చేయాలి. రూ.600 కోట్ల ఆర్థిక నష్టం ఆరోపణపై సమగ్ర విచారణ జరపాలి. టెండర్ల వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలి” అని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

"ఓట్ల దొంగతనం" జరుగుతోంది

దేశంలో "ఓట్ల దొంగతనం" జరుగుతోందంటూ తాము చేసిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలు సమర్పించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తమను కోరినట్లు లోక్‌సభ విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వెల్లడించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ చుట్టూ అలుముకున్న వివాదంపై శుక్రవారం ఇండియా కూటమి నేతలు రాష్ట్రపతిని కలిసిన అనంతరం ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ సహా పలువురు విపక్ష నేతల ప్రతినిధి బృందం రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపది ముర్ముతో సమావేశమైంది. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, భారత ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వారు రాష్ట్రపతికి ఒక వినతిపత్రం సమర్పించారు.

సమావేశం అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కలిసి భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని రాష్ట్రపతికి తెలియజేశామని చెప్పారు. "మా ఆరోపణలను నిరూపించేందుకు ఆధారాలు ఇవ్వాలని ఆమె కోరారు. ఆమెకు సమయం ఉన్నప్పుడు తప్పకుండా ఆధారాలను సమర్పిస్తాం" అని రాహుల్ తెలిపారు. రాష్ట్రపతి తమ వాదనలను తిరస్కరించలేదని, ప్రశ్నించలేదని, సమావేశం సంతృప్తికరంగా జరిగిందని ఆయన పేర్కొన్నారు.

ఈ అంశంపై సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించి, ప్రధాన న్యాయమూర్తికి కూడా ఒక వినతిపత్రం అందజేస్తామని రాహుల్ ప్రకటించారు.



కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. రాష్ట్రపతి తమ వాదనలను ఓపికగా విన్నారని తెలిపారు. "ఓట్ల దొంగతనంపై మేం నాలుగు రోజులుగా చేస్తున్న ఆందోళనల గురించి రాష్ట్రపతికి వివరించాం. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చేసిన తీవ్రమైన తప్పిదాన్ని, ఎన్నికల కమిషన్ పనితీరుపై మా ఆందోళనలను తెలియజేశాం. ఈవీఎంలను పక్కనపెట్టి, బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని మేం డిమాండ్ చేశాం" అని ఖర్గే వివరించారు.

టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ మాట్లాడుతూ.. "మేం వినతిపత్రం ఇచ్చాం. దీనిపై విచారణ జరుపుతానని, వివరాలు పరిశీలిస్తానని, ఆధారాలు కావాలని ఆమె చెప్పడాన్ని మేం సానుకూల దృక్పథంతో చూస్తున్నాం. దేశ ప్రజలు ఆందోళనగా ఉన్నారు, రాజ్యాంగ పరిరక్షకురాలిగా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆమెను కోరాం" అని అన్నారు.

ఈ ప్రతినిధి బృందంలో జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఎన్సీపీ-ఎస్పీ ఎంపీ సుప్రియా సూలే, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రాజీవ్ రాయ్ తదితరులు పాల్గొన్నారు. గత కొద్ది రోజులుగా ఎన్నికల కమిషన్, ఓటర్ల జాబితా సవరణ తీరుపై విపక్షాలు నిరసనలు వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.

'జెన్ జీకి భయపడుతున్న కేంద్రం

దిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (జజీ) అక్టోబర్ 10న భారీ ఎత్తున నిరసన నిర్వహించనున్నట్లు పిలుపునివ్వగా దేశ రాజధానిలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇక్కడ మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు, ప్రజా రవాణాపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో సీజేపీ నేతలు కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ నిరసనను అడ్డుకోవడానికి కేంద్రం దిల్లీని సైనిక కోటలా మార్చిందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న సీజేపీ దీనికి బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తుంది. ఇందులో భాగంగానే దిల్లీ జంతర్ మంతర్ వద్ద శనివారం నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపింది. ఈ క్రమంలోనే బెంగళూరు నుంచి తిరుగుపయనం అవుతూ ముంబై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే. తమ నిరసనను అడ్డుకోవడానికి ప్రజల రాకపోకలపై ఆంక్షలు విధించడం సరికాదని, వారిని ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని ప్రశ్నించారు. శనివారం జంతర్ మంతర్ వద్ద నిర్వహించ తలపెట్టిన నిరసనను విరమించుకోబోమని స్పష్టం చేశారు. జెన్ జీని చూసి కేంద్రం భయపడుతోందని వ్యాఖ్యలు చేసిన దీప్కే- యువతను చూసి అంతగా భయపడుతుంటే దేశం మొత్తాన్ని మూసేయండని ఆగ్రహం వ్యక్తం చేశారు. దిల్లీ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల ప్రైవేట్ ప్రాపర్టీ ఏం కాదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

నిరసనల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఒకవైపు చెబుతూనే, మరోవైపు మెట్రో స్టేషన్లు, రైళ్ల రాకపోకలపై ఆంక్షలు విధించడం వల్ల ప్రజలకు మరింత ఇబ్బంది కలగదా? అని ప్రశ్నించారు. కేంద్రం చర్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని అభిజీత్ తెలిపారు. కశ్మీర్, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల నుంచి భద్రతా బలగాలను దిల్లీకి ఎందుకు తరలిస్తున్నారని, యువతను పాకిస్థానీలను చూసినట్లు చూస్తుందని దీప్కే మండిపడ్డారు. తనను అరెస్ట్ చేయడం వల్ల సమస్యలు పరిష్కారమవుతాయని ప్రభుత్వం భావిస్తే, ధైర్యముంటే తనను అరెస్ట్ చేయాలని సవాల్ విసిరారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చేసిన దానికి ఆయన శిక్ష అనుభవించాలని, సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇక దిల్లీలో ప్రస్తుత పరిస్థితులను ఎమర్జెన్సీతో పోల్చారు మరో సీజేపీ నేత సౌరవ్ దాస్. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పార్టీ కార్యకర్తలను నిర్బంధిస్తున్నారని, కొందరిని గృహ నిర్బంధం చేశారని ఆరోపించారు. ఆంక్షలు, పరిమితులతో దిల్లీని కోటలా మార్చారని విమర్శించారు.



మెట్రో, రైళ్లపై ఆంక్షలు- సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

సీజేపీ నిరసనల నేపథ్యంలో రవాణా మార్గాలపై ప్రభుత్వం విధించిన ఆంక్షలపై దాఖలైన విజ్ఞప్తులను పరిశీలించిన సుప్రీం కోర్టు గురువారం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రధాన న్యాయమూర్తి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ- నిరసనల కారణంతో మెట్రో రైళ్లు, ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయకూడదని స్పష్టం చేసింది. గురుగ్రామ్, గ్రేటర్ నోయిడా నుంచి దిల్లీకి వచ్చే విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని వ్యాఖ్యానించింది. రవాణా సేవలపై తీసుకునే నిర్ణయాలను ప్రజలకు తప్పనిసరిగా ముందుగానే తెలియజేయాలని సూచించింది. నిరసనలకు జంతర్ మంతర్‌నే కొనసాగించాలా? ప్రత్యామ్నాయ ప్రదేశాన్ని చూడాలా? అనే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలించాలని పేర్కొంది.

దిల్లీ పోలీసుల ఉన్నత స్థాయి సమీక్ష- ఇంటర్నెట్ బంద్

సీజేపీ నిరసనల నేపథ్యంలో దిల్లీ పోలీస్ కమిషనర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్నతాధికారులు అత్యవసర సమావేశం నిర్వహించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. కేంద్ర హోం శాఖ ఆమోదంతో జంతర్ మంతర్ పరిసరాల్లో 4 కిలోమీటర్ల పరిధిలో అక్టోబర్ 9 రాత్రి 10 గంటల నుంచి అక్టోబర్ 10 రాత్రి 10 గంటల వరకు మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. న్యూదిల్లీ జిల్లా పరిధిలో దీచ్మూ సెక్షన్ 163 అమల్లో ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారు. ఇంకా 'యాన్ ఓపెన్ లెటర్ టు ఎవ్రీ సిటిజెన్' పేరుతో ప్రతి ఒక్కరూ శాంతి భద్రతలకు సహకరించాలని పోలీసులు ఎక్స్ వేదికగా బహిరంగ లేఖను కూడా విడుదల చేశారు.

నీట్ విధానంలో మరిన్ని సంస్కరణలు

ఈ ఏడాది నీట్ యూజీ 2026 ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలు, పరీక్ష రద్దు నేపథ్యంలో ఈ వ్యవహారంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన రిపోర్టును విడుదల చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పారదర్శకతను పెంచడానికి, అక్రమాలను అరికట్టేందుకు కీలక సంస్కరణలను ప్రతిపాదించింది. ఇక్కడ ఎన్టీఏ పార్లమెంటుకు (లోక్‌సభ, రాజ్యసభ) జవాబుదారీగా ఉండేలా చట్టపరమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని విద్యా వ్యవహారాలపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘం సూచించింది. పరీక్షల నిర్వహణపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సహా ప్రజల్లో నమ్మకాన్ని నిలబెట్టడం చాలా ముఖ్యమని స్పష్టం చేసింది. పరీక్షలపై విశ్వాసం దెబ్బతినకుండా చూసేందుకు తగిన పార్లమెంటరీ వ్యవస్థను విద్యాశాఖ ప్రవేశపెట్టాలని కమిటీ తెలిపింది. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడాలనుకునే వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లు నిరంతరం కొత్త మార్గాలను అన్వేషిస్తుంటాయని, పరీక్ష నిర్వహణలోని బలహీనతలను ఉపయోగించుకునేందుకు చూస్తాయని పేర్కొంది.

ఈ నేపథ్యంలో అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ నీట్ యూజి 2026 పరీక్షను రద్దు చేయాల్సి రావడం మాత్రం సంస్థాగత, విధానపరమైన లోపాలను సృష్టిస్తోందని కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ సింగ్ నేతృత్వంలోని ఈ కమిటీ అభిప్రాయపడింది. అందుకే ఎన్టీఏలో తగినంత సిబ్బంది, పటిష్టమైన భద్రతా విధానాలు, స్పష్టమైన జవాబుదారీ వ్యవస్థలు ఉండాలని సూచించింది. ముఖ్యంగా చీఫ్ ప్రశ్నాపత్రాలను తయారు చేసే అధ్యాపకులు, నిపుణుల గత చరిత్ర ముఖ్యంగా నైతికతను పరిశీలించడానికి ఒక ప్రత్యేక ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. క్వశ్చన్ పేపర్లు తయారు చేసే వారికి కూడా ఏ ప్రశ్నలు పరీక్షలు వస్తున్నాయో ముందుగా తెలియకుండా ఉండేలా ఎన్టీఏ పెద్ద క్వశ్చన్ బ్యాంకులను రూపొందించాలని స్పష్టం చేసింది.



ఆటోమేటెడ్ సిస్టమ్ ద్వారా ప్రశ్నలు!

ఇదే సమయంలో కంప్యూటర్ బేస్డ్ ఆటోమేటెడ్ సిస్టమ్ ద్వారా చివరి క్షణంలో ప్రశ్నలను ఎంపిక చేసే విధానం రావాలని కమిటీ పేర్కొంది. పెన్ అండ్ పేపర్ పద్ధతిలో నిర్వహించే నీట్‌లో ప్రశ్నా పత్రాల లీకేజీ ప్రమాదం ఎక్కువగా ఉందన్న కమిటీ, దీనిని అధిగమించడానికి నీట్ యూజీని పూర్తి స్థాయిలో కంప్యూటర్ బేస్డ్ టెస్టుగా నిర్వహించాలని రికమెండ్ చేసింది. ఇదే సమయంలో ప్రైవేట్ పరీక్షా కేంద్రాలపై ఆధారపడటాన్ని తగ్గించి, ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థలు, డిజిటల్ కేంద్రాల ద్వారానే ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని సూచించింది. కొన్ని కారణాల వల్ల పరీక్ష కేంద్రాలకు కొద్దిగా ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అండర్‌టేకింగ్ తీసుకొని పరీక్ష రాయడానికి అనుమతించాలని పార్లమెంటరీ ప్యానెల్ పేర్కొంది.

మే 3న పరీక్ష- తర్వాత రద్దు- రీ ఎగ్జామ్!

ఈ ఏడాది మే 3న దేశవ్యాప్తంగా 551 నగరాలు, విదేశాల్లోని 14 కేంద్రాల్లో నీట్ యూజీ పరీక్ష నిర్వహించగా, సుమారు 22 లక్షల మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. అయితే వ్యవస్థీకృత ముఠాలు ప్రశ్నాపత్రాన్ని లీక్ చేశారన్న ఆరోపణలతో మే 12న ఎన్‌టీఏ ఈ పరీక్షను రద్దు చేసింది. తర్వాత కేంద్ర ప్రభుత్వం ఆమోదంతో జూన్ 21న నీట్ యూజీ 2026 రీ ఎగ్జామ్ నిర్వహించారు. ఇక ఈ కేసును విచారించిన కేంద్ర దర్యాప్తు సంస్థ - ఒక కెమిస్ట్రీ లెక్చరర్‌ను అరెస్ట్ చేసింది. పరీక్షకు ముందే పుణెలోని ఒక స్పెషల్ కోచింగ్ క్లాస్‌లోని విద్యార్థులకు ఆయన ప్రశ్నలు, ఆప్షన్లు, సరైన సమాధానాల్ని చెప్పారని, అవి అసలు ప్రశ్నా పత్రంతో సరిపోలాయని సీబీఐ కూడా నిర్ధరించింది. ఈ నేపథ్యంలో విద్యార్థులు, ఇతర పౌర సమాజ సంస్థలు, ప్రతిపక్షాలు దీనిపై పెద్ద ఆందోళన నిర్వహించాయి. దిల్లీ జంతర్ మంతర్ కేంద్రంగా అభిజీత్ దీప్కే నేతృత్వంలో కాక్రోచ్ జనతా పార్టీ చేసిన నిరసనలు చాలా రోజులు కొనసాగాయి. ఈ క్రమంలోనే అప్పటి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామాకు డిమాండ్ చేయగా, కొన్ని రోజులకు ఆయన తప్పుకున్నారు. ఆయన స్థానంలో ప్రహ్లాద్ జోషిని కేంద్రం విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. అయినా అప్పటి నుంచి కాంగ్రెస్ సహా ఇతర విపక్ష పార్టీలు దేశంలో పరీక్షల నిర్వహణపై, విద్యా వ్యవస్థపై ప్రశ్నిస్తూనే ఉన్నాయి.

'ఏ రంగంలోనూ గుత్తాధిపత్యాన్ని భారత్ అనుమతించదు'

భారత్‌లో ఏ రంగంలోనూ గుత్తాధిపత్యాన్ని అనుమతించదని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను అందించేందుకు భారత్‌లో తమ సంస్థను అనుమతించడం లేదని స్టార్‌లింక్ అధిపతి ఎలాన్ మస్క్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో శుక్రవారం ఆయన ఈ మేరకు స్పందించారు. ప్రస్తుతం ఒక కంపెనీ గురించి అందరూ ఎక్కువగా చర్చిస్తున్నారని సింధియా తెలిపారు. వాస్తవానికి ఇప్పటికే మూడు కంపెనీలకు శాట్‌కామ్ లైసెన్సులు మంజూరు చేసినట్లు సింధియా వెల్లడించారు. అయితే, భద్రతా ప్రమాణాలు, నిర్దేశిత మార్గదర్శకాలను నెరవేర్చిన తర్వాతే ఆయా సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించగలవని సింధియా స్పష్టంచేశారు. ఫ్రీ మార్కెట్‌లో వినియోగదారులు తమకు నచ్చిన సేవలను ఎంచుకుంటారని, వారికి పలు ఆప్షన్లను అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. మస్క్‌కు మద్దతు తెలుపుతూ రాహుల్ చేసిన పోస్టుపైనా ఆయన మండిపడ్డారు. గతంలో ఒక నిర్దిష్ట వ్యక్తికి లైసెన్స్ ఇవ్వడంపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసిందని అన్నారు. ఇప్పుడు అదే వ్యక్తితో చేతులు కలిపి ఆయనకు లైసెన్స్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించడం ఆ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని సింధియా విమర్శించారు.

తీవ్ర దుమారం రేపుతున్న మస్క్ వ్యాఖ్యలు

స్టార్‌లింక్‌ను భారత్‌లోకి రాకుండా కొందరు శక్తిమంతులు అడ్డుకుంటున్నారని ఎలాన్ మస్క్ ఇటీవల ఆరోపించారు. వారు టెలికాం రంగంలో గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారన్న మస్క్, ఇండియాకు అంబానీయే బాసా? అని అన్నారు. మస్క్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం దుమారం రేపుతున్నాయి. అయితే, మస్క్? వ్యాఖ్యలను భారత్ ఖండించింది. శాటిలైట్ ఇంటర్నెట్ సేవలపై స్టార్‌లింక్ సహా జియో, ఎయిర్‌టెల్ వంటి భారత సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయని, ఇప్పటివరకు దేనికీ పూర్తిస్థాయి అనుమతులు ఇవ్వలేదని తెలిపింది. ఆ మూడు సంస్థలూ ఒకే దశలో ఉన్నాయని తెలిపిన ప్రభుత్వం భద్రతా ప్రమాణాల తనిఖీల తర్వాత మాత్రమే స్పెక్ట్రమ్ కేటాయింపులు ఉంటాయని వివరించింది. మరోవైపు, మస్క్ ఆరోపణల వెనుక భారతీయుల మీద ప్రేమ కంటే, తన వ్యాపార, అమెరికా వ్యూహాత్మక ప్రయోజనాలే దాగి ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశ భద్రతను పణంగా పెట్టి, భారత సంపదను కొల్లగొట్టే మస్క్ స్టార్‌లింక్ మనకు నిజంగా అవసరమా అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ప్రపంచంలో చౌకగా డేటా దొరికే భారత్‌లో ఈ వ్యవహారంపై నిపుణులు, నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఉక్రెయిన్, ఇరాన్, ఇజ్రాయెల్ వంటి దేశాల్లో స్టార్‌లింక్ సేవలను అమెరికా తన భౌగోళిక రాజకీయ ప్రయోజనాల కోసం ఒక ఆయుధంగా వాడుకుంటోందని అలాంటి సాంకేతికత విషయంలో భారత ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించడం సమంజసమేనని విశ్లేషకులు చెబుతున్నారు. మస్క్ చెబుతున్న 'చౌక' ఇంటర్నెట్ వాదనను నెటిజన్లు, నిపుణులు డేటాతో సహా తీవ్రంగా ఎండగడుతున్నారు. ప్రస్తుతం భారత్‌లో 100 mbps వేగమున్న ఇంటర్నెట్ కోసం నెలకు సగటున రూ.700 నుంచి రూ.900 రూపాయలు మాత్రమే ఖర్చవుతోంది. అదే చైనాలో రూ.2,000 నుంచి రూ.3,000 వరకు ఉంది. కానీ, మస్క్ స్టార్‌లింక్ ఇంటర్నెట్ వాడాలంటే నెలకు రూ. 8,000 చెల్లించాలి. దానికి తోడు పరికరాల ఇన్‌స్టాలేషన్ కోసం అదనంగా వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుందని నెటిజెన్లు పోస్టులు పెడుతున్నారు. నెలకు ఏడు వందలు కట్టే భారతీయులకు, రూ. 8,000కు పైగా వసూలు చేసే స్టార్‌లింక్ ఏ రకంగా చౌక అవుతుందని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఇది కచ్చితంగా దేశ సంపదను భారీగా కొల్లగొట్టి బయటకు తరలించడమేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భారత టెలికాం రంగంలో పోటీ కొరవడి కేవలం కొన్ని సంస్థల ఆధిపత్యమే కొనసాగుతోందన్న మస్క్ వాదనలో నిజం లేకపోలేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. డేటా ధరలు తక్కువగా ఉన్నప్పటికీ, నెట్‌వర్క్ నాణ్యత మాత్రం నాసిరకంగా ఉంటోందని టెలికాం రంగంలో పోటీ పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని మరికొందరు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

వ్యాపారానికి కాదు, గుత్తాధిపత్యానికే మేము వ్యతిరేకం

దేశంలో ప్రతి వ్యాపార సంస్థకు కూడా సమానంగా అవకాశాలు ఉండాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. కేవలం రాజకీయ అండతోనే కొన్ని సంస్థలకు ప్రత్యేకంగా ప్రయోజనం కల్పించే విధానాన్ని అంతం చేసి, పోటీ వాతావరణాన్ని కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఆవిష్కరణలు, కష్టపడి పనిచేసే తత్వంపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థను నిర్మించడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. భారత్‌లో స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు వాణిజ్యపర అనుమతులు ఇంకా లభించలేదని స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఈ చర్చ మొదలైంది. గురువారం రోజు మస్క్ చేసిన ఎక్స్ పోస్టుకు రాహుల్ బదులివ్వడం, మళ్లీ మస్క్ థ్యాంక్యూ చెప్పారు. తాను వ్యాపారాలకు వ్యతిరేకం కాదని, కేవలం గుత్తాధిపత్యానికే వ్యతిరేకమని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఈ మేరకు రాహుల్ తన వాట్సాప్ ఛానల్ ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధించాలంటే ప్రతీ చిన్నా, పెద్ద వ్యాపార సంస్థకు సమాన అవకాశాలు కల్పించాలని, ఇందుకోసం లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ ఉండాలని డిమాండ్ చేశారు. మరోవైపు వివిధ రంగాల్లో పోటీని తగ్గించి గుత్తాధిపత్యాన్ని ప్రోత్సహిస్తోందని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా విమర్శలు చేశారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలపై ఖర్గే, రాహుల్ గాంధీ శుక్రవారం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ఇండియాకు అసలు బాస్ అంబానీనా?

అంతకుముందు భారత చట్టాలు, నిబంధనలు అన్నీ పాటిస్తూ ఐదేళ్లుగా చూస్తున్నా స్టార్‌లింక్‌కు ఇండియాలో లైసెన్స్ రాలేదని, గుత్తాధిపత్యం చెలాయిస్తున్న కొందరు బడా వ్యాపారులు తమకు లైసెన్స్ రాకుండా అడ్డుకుంటున్నారని మస్క్ తెలిపారు. ఇంకా ఇండియాకు అసలు బాస్ అంబానీనా? అని మస్క్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీనికి స్పందించిన రాహుల్ 'వెల్‌కమ్ టు ఇండియా ఎలాన్. మరో వ్యక్తి గురించి కూడా తెలుసుకునే వరకు వెయిట్ చెయ్' అని రిప్లై ఇచ్చారు. దీనికి మస్క్ మళ్లీ థ్యాంక్యూ చెప్పి, ఇది చాలా ఆందోళనకర విషయం అన్నారు. ఈ క్రమంలోనే ప్రతి వ్యాపార సంస్థకు ఇండియాలో సమాన అవకాశాలు ఉండాలని రాహుల్ ఓ వీడియోలో తెలిపారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే కూడా ఎక్స్ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. మోదీ ప్రభుత్వ విధానాలు తమకు అనుకూలమైన పెట్టుబడిదారులకే అవకాశం ఇచ్చి ఆర్థిక వ్యవస్థపై నియంత్రణ కలిగి ఉండేలా ఉన్నాయని, దీని ద్వారా బీజేపీ ప్రయోజనాలు పొందుతోందని విమర్శలు గుప్పించారు. మొత్తానికే పోటీని అంతం చేసి గుత్తాధిపత్యం చెలాయిస్తున్న లేదా రెండు ప్రధాన సంస్థల ఆధిపత్యాన్నే ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వ్యవస్థ పునాదులు దెబ్బతింటున్నాయని ఖర్గే పేర్కొన్నారు. ఈ విధానాన్ని ఆర్థిక ఉగ్రవాదం (ఎకనామిక్ టెర్రరిజం) అని ఆయన అభివర్ణించారు.

టెలికాం, విమానయాన రంగంలో పోటీనే లేదు: ఖర్గే

తన వాదనకు బలం చేకూర్చేలా ఖర్గే ఉదాహరణలతో వివరించారు. ఇక్కడ టెలికాం, విమానయాన రంగాలను ఆయన ప్రస్తావించారు. 2014కు ముందు టెలికాం రంగంలో ఇండియాలో 13 సంస్థలు ఉండగా, ప్రస్తుతం 3 ప్రైవేట్ సంస్థలే మిగిలాయని ఖర్గే గుర్తు చేశారు. ఇంకా దేశీయ విమానయాన రంగంలో కూడా 2014కు ముందు వరకు 7 ప్రధాన సంస్థలు ఉండేవని, ప్రస్తుతం అక్కడా రెండు ప్రధాన సంస్థలే మిగిలాయని ఆరోపించారు. ఇంకా వీటికి తోడు డిజిటల్ పేమెంట్స్, ఫుడ్ డెలివరీ యాప్స్, సిమెంట్ వంటి రంగాల్లోనూ క్రమంగా పోటీ లేకుండా చేయడమే ప్రభుత్వ ప్రాధాన్యంగా మారిందని ఖర్గే విరుచుకుపడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు పెద్ద సంఖ్యలో మూతపడుతున్నాయని, యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటోందని అన్నారు. ఇదిలా ఉండగా స్టార్‌లింక్ కమర్షియల్ లైసెన్స్ గురించి మస్క్ చేసిన ఆరోపణలను కేంద్రం తోసిపుచ్చింది. శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలు అందించడానికి దరఖాస్తు చేసుకున్న అన్ని సంస్థలకు తాము సమాన అవకాశాలు కల్పిస్తున్నామని, వివక్ష లేని న్యాయమైన విధానం అమల్లో ఉందన్నారు. ఇక్కడ అవసరమైన భద్రతా పరిశీలనలు, స్పెక్ట్రమ్‌కు సంబంధించిన అనుమతులు పూర్తయ్యే వరకు ఏ సంస్థ కూడా వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించలేదని తెలిపింది. ఈ క్రమంలోనే స్టార్‌లింక్ అనుమతుల అంశం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

ఆర్టీఐ సమాచారానికి అధిక రుసుములపై విచారణ జరపాలి

పాఠశాల నిధుల ఖర్చులపై అనుమానాలు.. సమగ్ర విచారణకు బీజేపీ డిమాండ్

కోహెడ, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)



సిద్దిపేట జిల్లా కోహెడ మండలం నాగసముద్రాల తెలంగాణ మోడల్ స్కూల్‌లో సమాచార హక్కు చట్టం అమలులో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న జాప్యం, అధిక రుసుముల వసూలు డిమాండ్‌పై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వేంకటేశం డిమాండ్ చేశారు. పాఠశాల నిధులు, బ్యాంకు ఖాతాల వివరాల కోసం గుగ్లోత్ శేఖర్ నాయక్ ఆగస్టు 22న ఆర్టీఐ దరఖాస్తు చేయగా, సుమారు 1,800 పేజీల సమాచారానికి రూ.5,400 చెల్లించాలని సెప్టెంబర్ 22న ప్రిన్సిపాల్ లేఖ ఇచ్చినట్లు తెలిపారు. ఈ రుసుము నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో అధికారులు పరిశీలించాలని కోరారు. సెప్టెంబర్ 26న జిల్లా విద్యాశాఖ అధికారికి మొదటి అప్పీల్ చేసినప్పటికీ స్పందన రాలేదని పేర్కొన్నారు. ఆర్టీఐ చట్టంలోని నిబంధనల ప్రకారం ఉచితంగా సమాచారం అందించాల్సిన అంశాన్ని పరిశీలించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే తదుపరి అప్పీల్‌తో పాటు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని వేంకటేశం హెచ్చరించారు.

కామ్రేడ్ తాళ్లూరు భద్రయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి



చిలుకూరు, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)

చిలుకూరు మండలం బేతవోలులో ఎస్.కె. మహమ్మద్ అధ్యక్షతన సీపీఐ గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, మండల సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు అమరజీవి కామ్రేడ్ తాళ్లూరు భద్రయ్య 19వ వర్ధంతిని ఈ నెల 14న ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తాళ్లూరు వెంకటయ్య, బెజవాడ వినోద్, అలవాల రాజేష్, తాళ్లూరి పెద్ద మల్లయ్య, తాళ్లూరి రామారావు, నేలపట్ల జనార్ధన్, బెజవాడ నాగయ్య, చందా రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్. జయరాం నాయక్‌కు ఘన సన్మానం



వనపర్తి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్. జయరాం నాయక్‌ను గిరిజన సేవా సంఘం, గిరిజన ఉద్యోగుల సంఘం, విద్యార్థి సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు చంద్రు నాయక్, గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శంకర్ నాయక్, విద్యార్థి సంఘాల నాయకుడు శివ నాయక్ తదితరులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, గిరిజన సమాజ అభ్యున్నతికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాతృ నాయక్, సూర్య నాయక్, అర్జున్ నాయక్,గోపాల్ నాయక్, దశరథ్ నాయక్, శ్రీధర్ నాయక్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

చెరుకు శివ గౌడ్ ధర్నాతో వలిగొండ జంక్షన్ రోడ్డు పునరుద్ధరణ



చౌటుప్పల్, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని వలిగొండ రోడ్డు జంక్షన్‌ను ఫ్లైఓవర్ నిర్మాణ పనుల పేరుతో రెండు రోజులుగా మూసివేయడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దసరా పండుగ వేళ ప్రజలకు కలిగిన అసౌకర్యంపై సామాజికవేత్త చెరుకు శివ గౌడ్ శుక్రవారం రాత్రి స్థానికులతో కలిసి జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు. వెంటనే రోడ్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ అధికారులతో చర్చించడంతో స్పందించిన అధికారులు రోడ్డుకు అడ్డంగా వేసిన మట్టి, దిబ్బలను తొలగించి శనివారం రాకపోకలను పునరుద్ధరించారు. ఇందుకు సహకరించిన ఎన్‌హెచ్ఏఐ అధికారులు, మున్సిపల్ చైర్మన్, మీడియా ప్రతినిధులకు శివ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఫ్లైఓవర్ అసంపూర్తి పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని ఆయన కోరారు.

అమావాస్య సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

చౌటుప్పల్, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)



చౌటుప్పల్ పట్టణ బస్టాండ్ వద్ద శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పేదలకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాంచెట్టి చంద్రశేఖర్ గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అమావాస్య రోజున ఆర్యవైశ్యులంతా కలిసి పేదలకు ఉచితంగా అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తడకమళ్ల శ్రీనివాస్, కామిశెట్టి భాస్కర్ గుప్తా, నీల రమేష్ గుప్తా, సీతారాములు, సింగరికొండ శ్రీను, నీళ్ల సత్యనారాయణ, నీల వెంకన్న, వీరమల్ల సూర్యనారాయణ, ఇడుపుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ నూతన కార్యవర్గం ప్రకటన

- అధ్యక్షుడిగా కాసర్ల శ్రీనివాసరెడ్డి..
- నూతన కమిటీ తొలి సమావేశం



చౌటుప్పల్, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సిఫారసు మేరకు చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కమిటీని ఆమోదించారు. నూతన కార్యవర్గ తొలి సమావేశాన్ని పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బాధ్యతలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.కమిటీ అధ్యక్షుడిగా కాసర్ల శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఇప్ప వెంకటేష్, ఎర్రగోని లింగస్వామి, ఉపాధ్యక్షులుగా అంతటి విజయలక్ష్మి బాలరాజు, బండమీది మల్లేష్, సయ్యద్ వాయుద్దీన్, చెరుకు లింగస్వామి, వర్కాల వెంకట్ కుమార్, అధికార ప్రతినిధిగా సామకూర యాదయ్య నియమితులయ్యారు. కార్యదర్శులుగా గుండెబోయిన మనిత ఐలయ్య యాదవ్, ఓర్సు శ్రీజా రాజు, మహమ్మద్ ఫిరోజ్, మట్టుపల్లి యాదగిరి, మాదాని గోపాల్, దోమటి దయాకర్ రెడ్డి, బత్తుల రాజు, జక్కర్తి సుధా, పేరుపల్లి సుమతి తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గ ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జంతర్ మంతర్ ఉద్యమంపై నిరర్ మంతర్ ఉద్యమంపై నిర్బంధాన్ని ఖండిస్తున్నాం

పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. నరసింహారావు



నర్సంపేట, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు, యువత చేపట్టిన ఉద్యమాన్ని అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్బంధ చర్యలకు పాల్పడటాన్ని ఖండిస్తున్నామని పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. నరసింహారావు అన్నారు. నర్సంపేటలోని పి.డి.ఎస్.యు. కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి అజయ్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం నిరసన తెలిపే ప్రజాస్వామిక హక్కును కాలరాయడం సరికాదన్నారు. అరెస్టు చేసిన విద్యార్థులు, యువతను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిర్బంధ చర్యలు ఆపకపోతే గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని విస్తరిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు పి. అనూష, దండు వినయ్, సహాయ కార్యదర్శి అలువాల నరేష్, కే. రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

వనపర్తి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ పోరాట సంఘాల సమితి (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో శనివారం వనపర్తిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజీవ్ చౌక్ వద్ద జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, దేశంలో 13 కోట్ల మంది ఓటర్లను తొలగించారన్న ఆరోపణలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని, ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. కృష్ణయ్య, డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే. ఏసోఫ్, చిన్న రాములు, టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి కే. వెంకట నారాయణ, డీటీఎఫ్ నాయకులు నరసింహ, కురుమూర్తి, రచయిత సి. కిరణ్ కుమార్, ఎం.డి. హమీద్, ఏ. వెంకటేశ్వర్లు, బి. శ్రీనివాసులు, శాంతన్న, సురేష్, చిన్నస్వామి, శంకర్ నాయక్, డి. రాము, సుభాష్, చంద్రశేఖర్, రిటైర్డ్ ఉద్యోగులు వేణుగోపాల్, అగ్గిరాములు, శివారెడ్డి, అంబటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారాలపై ఉన్న శ్రద్ధ ప్రయాణికుల సౌకర్యాలపై ఏదీ?

- నాలుగు దశాబ్దాలైనా మారని వనపర్తి బస్టాండ్ తీరు
- పండుగ వేళ బస్సుల కోసం పడిగాపులు..
  చెత్తాచెదారంతో ఇబ్బందులు
- అధికారుల నిర్లక్ష్యంపై అఖిలపక్ష ఐక్యవేదిక ఆగ్రహం






వనపర్తి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

వనపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు విమర్శించారు. దసరా పండుగ సందర్భంగా బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, బస్టాండ్ పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోయినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బస్టాండ్‌ను పరిశీలించిన నాయకులు సమస్యలను గుర్తించారు. అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ సతీష్ యాదవ్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా బస్టాండ్ ఆధునికీకరణకు నోచుకోలేదని విమర్శించారు. పండుగ రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలని, తాగునీరు, కూర్చునే వసతి, పారిశుద్ధ్యం మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. అధికారులు స్పందించకపోతే ప్రయాణికుల సమస్యలపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుడు కొత్తగొల్ల శంకర్, బీజేపీ నాయకులు రవి, రామస్వామి, తిరుపతి నాయక్, శివకుమార్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లింగమయ్య పార్థివదేహానికి ఏబీవైఎఫ్ నాయకుల నివాళి



డిండి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

అఖిల భారత యువజన సమాఖ్య డిండి మండల కార్యదర్శి ఎలిమినేటి నరేష్ తండ్రి లింగమయ్య పార్థివదేహానికి ఏబీవైఎఫ్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఎనమల్ల నవీన్, డిండి మండల అధ్యక్షుడు కాంపల్లి ప్రవీణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నరేష్‌ను పరామర్శించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయక్ మధుకర్, ఎండీ బాలపిర్, ఎండీ బాబర్, ఎండీ ఆదిల్, మీనుగా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్లలో ఘనంగా అన్నపూర్ణ అమావాస్య అన్నప్రసాద వితరణ

- 800 మందికి అన్నప్రసాదం..
- ప్లాస్టిక్ రహితంగా సేవా కార్యక్రమం



కోరుట్ల రూరల్, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)

కోరుట్ల కొత్త బస్టాండ్ ఆవరణలో సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో శనివారం అన్నపూర్ణ అమావాస్య అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, వైదిక నిర్వహణలో సామూహిక గోపూజ, అన్నపూర్ణ మాత పూజ నిర్వహించారు. అనంతరం సుమారు 800 మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. గత 15 నెలలుగా ప్రతి అమావాస్యనాడు పితృదేవతల ప్రీత్యర్థం, లోకకల్యాణం కోసం ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి, స్టీల్ ప్లేట్లు, గ్లాసులను ఉపయోగించారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి బట్టు హరికృష్ణ, కోశాధికారి రేగుంట రాజారాం, కమిటీ చైర్మన్ వనపర్తి చంద్ర మోహన్, కన్వీనర్ గంప శివకుమార్, ఇతర కమిటీ సభ్యులు, ఆధ్యాత్మిక సేవకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సందడిగా బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ఎంగిలిపూల బతుకమ్మ



వీణవంక, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని పలు గ్రామాల్లో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు సందడిగా ప్రారంభమయ్యాయి. మహిళలు, యువతులు తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. తరతరాలుగా వస్తున్న బతుకమ్మ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ మహిళలు ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు.



ఆకలితో ఉన్నవారి కడుపు నింపడం మహాపుణ్యం

హుజూర్‌నగర్, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)

వేయి దేవాలయాలు నిర్మించడం కంటే ఆకలితో ఉన్నవారి కడుపు నింపడం మహాపుణ్యమని భావిస్తూ హుజూర్‌నగర్ సమీపంలోని పడగరాయి గుట్ట స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రతి శుక్రవారం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ వారం మిర్యాలగూడ మండలం కొత్తగూడెంకు చెందిన సందీప్ రెడ్డి, చందన దంపతులు అన్నదానానికి సహకరించారు. స్వామివారి సన్నిధిలో అన్నదానం చేయడం తమకు ఎంతో భాగ్యమని వారు తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు తమ వంతు సహకారం అందించాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు శాగం రెడ్డి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పొనుగుపాటి వెంకటేశ్వరరావు, కోశాధికారి గుర్రం చిన్న వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు తోడేటి సర్వయ్య, వీరవల్లి గురునాథం, శంకరమ్మ, అమరోజ్ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పెన్షన్ దేశానికి భారమా?

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి: పలుస శంకర్ గౌడ్

వనపర్తి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)



పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) ఆర్థిక అత్యవసర పరిస్థితికి కారణంగా చిత్రీకరిస్తూ ఉద్యోగులను దోపిడీదారులుగా చూపడం సరికాదని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. ఉద్యోగుల పెన్షన్‌పై డాక్టర్ జయప్రకాష్ నారాయణ రాసిన వ్యాసంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు మూడు, నాలుగు దశాబ్దాల పాటు ప్రజలకు సేవలందించిన అనంతరం వృద్ధాప్యంలో గౌరవంగా జీవించేందుకు పెన్షన్ అవసరమని పేర్కొన్నారు. పెన్షన్ అనేది దానం కాదని, ఉద్యోగుల దీర్ఘకాలిక సేవకు ప్రతిఫలంగా లభించే సామాజిక భద్రత అని అన్నారు. ప్రభుత్వ అప్పులకు పెన్షనే కారణమని చెప్పడం సరికాదని, కార్పొరేట్ రాయితీలు, పన్ను మినహాయింపులపై కూడా చర్చ జరగాలని సూచించారు. ప్రజాప్రతినిధులకు లభించే పెన్షన్ సదుపాయాలపై ప్రశ్నించకుండా ఉద్యోగుల పెన్షన్‌ను భారంగా చిత్రీకరించడం ద్వంద్వ ప్రమాణమని విమర్శించారు. మార్కెట్‌పై ఆధారపడే కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంలో ఉద్యోగుల భద్రతకు ముప్పు ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పలుస శంకర్ గౌడ్ డిమాండ్ చేశారు.

గీత కార్మికులకు పెండింగ్ ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలి

మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ డిమాండ్



నర్సంపేట, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

రాష్ట్రవ్యాప్తంగా తాటి చెట్లపై నుంచి పడి గాయపడిన, మృతిచెందిన గీత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం నల్లబెల్లి మండలం శనిగరం గౌడ సంఘం నూతన అధ్యక్షుడు బూర శ్రీనివాస్ గౌడ్‌ను శ్రీకంఠ మహేశ్వర ఆలయంలో అనంతుల రమేష్ గౌడ్, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ, ఎక్స్‌గ్రేషియా చెల్లింపుల్లో జాప్యం చేయకుండా బాధిత గీత కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ఉపాధ్యక్షుడు మాదాసు రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఉట్కూరి శ్రీనివాస్ గౌడ్, సభ్యులు బూర గోపి గౌడ్, బూర తిరుపతి గౌడ్, కక్కెర్ల శ్రీధర్ గౌడ్, కోల జంపయ్య గౌడ్, పెరుమాండ్ల శ్రీనివాస్ గౌడ్, గడ్డమీది శోభన్ గౌడ్, పెరుమాండ్ల కుమారస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాగటి నారాయణకు ఘనంగా నివాళులు



వనపర్తి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రాల పూర్వ అధ్యక్షుడు అమరజీవి నాగటి నారాయణ వర్ధంతి సందర్భంగా వనపర్తిలో శనివారం ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. కృష్ణయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగుల హక్కుల కోసం నాగటి నారాయణ జీవితాంతం పోరాడారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శులు ఎం.డి. హమీద్, ఏ. వెంకటేష్, డీటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు నరసింహ, కురుమూర్తి, జిల్లా కార్యదర్శి కొంగల వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

ఎఫ్ఎంజీ ఇంటర్న్‌లకు సమాన స్టైఫండ్ చెల్లించాలి

జనవరి 2026 నుంచి పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి



కరీంనగర్, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

తెలంగాణలో విదేశీ వైద్య పట్టభద్రుల (ఎఫ్ఎంజీ) ఇంటర్న్‌లకు ఇతర వైద్య ఇంటర్న్‌లతో సమానంగా నెలకు రూ.29,792 స్టైఫండ్ చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనవరి 2026 నుంచి అర్హత ఉన్న కాలానికి సంబంధించిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ప్రస్తుతం కొందరికి స్టైఫండ్ అందడం లేదని, మరికొందరికి కేవలం రూ.5,000 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం అక్టోబర్ 8 నుంచి 10 వరకు అత్యవసర వైద్య సేవలను కొనసాగిస్తూ నిరసన చేపట్టామని పేర్కొన్నారు. అక్టోబర్ 11 నుంచి 13 వరకు తదుపరి నిరసనలు చేపట్టి, పరిష్కారం లభించకపోతే 14 నుంచి వైద్య విద్యా సంచాలకుల కార్యాలయం వద్ద శాంతియుత నిరసన నిర్వహిస్తామని వెల్లడించారు. సమాన స్టైఫండ్ చెల్లించి, తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగి హక్కు!

జయప్రకాశ్ నారాయణ వ్యాఖ్యలపై ఉద్యోగ సంఘాల నేతల ఆగ్రహం



కరీంనగర్ టౌన్, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

ప్రభుత్వ ఉద్యోగుల సేవలను, పదవీ విరమణ భద్రతను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం తగదని జిల్లా ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సంఘ్యం లక్ష్మణరావు అన్నారు. లోక్‌సత్తా నేత జయప్రకాశ్ నారాయణ వ్యాఖ్యలను ఖండిస్తూ, పెన్షన్ భిక్ష కాదని, జీవితకాల ప్రజాసేవకు దక్కాల్సిన హక్కు, గౌరవమని స్పష్టం చేశారు. ఉద్యోగుల పెన్షన్లపై ప్రశ్నించేవారు ప్రజాప్రతినిధుల పెన్షన్లు, ఇతర ప్రజా వ్యయాలపైనా చర్చించాలని సూచించారు. తెలంగాణలో పెండింగ్ డీఏలు, పీఆర్సీ, ఆరోగ్య పథకాలు, పదవీ విరమణ ప్రయోజనాల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కొందరి తప్పులను సాకుగా చూపి మొత్తం ఉద్యోగ వ్యవస్థను కించపరచవద్దని పేర్కొన్నారు.

ఆర్టీసీ ఎన్నికల్లో ఐక్య కూటమి గెలుపు కార్మికుల జీవితాల్లో మలుపు

కార్మికులకు నిరంతరం అండగా ఉంటాం: సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్



కరీంనగర్, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్, టీఎంయూ, ఎన్ఎంయూ ఐక్య కూటమిని గెలిపించిన కార్మికులకు సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం కార్మికుల జీవితాల్లో కీలక మలుపు అని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతామని హామీ ఇచ్చారు. కూటమి విజయాన్ని పురస్కరించుకుని శనివారం కరీంనగర్-2 డిపో ఎదుట కార్మికులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, మచ్చ రమేష్, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో రికార్డు స్థాయికి విద్యుత్ డిమాండ్

- గత ఏడాదితో పోలిస్తే రెట్టింపైన వినియోగం.. సరఫరాకు ప్రత్యేక చర్యలు
- ఎస్ఈ నారాయణ నాయక్ వెల్లడి



మెదక్, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

మెదక్ జిల్లాలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినప్పటికీ, అందుకు అనుగుణంగా సరఫరా చేస్తున్నామని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) నారాయణ నాయక్ తెలిపారు. విద్యుత్ అంతరాయాలపై పత్రికల్లో వస్తున్న కథనాల నేపథ్యంలో శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. గత ఏడాది అక్టోబర్‌లో జిల్లాలో 282 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదుకాగా, ఈ ఏడాది అక్టోబర్‌లో 567 మెగావాట్లకు చేరిందని వెల్లడించారు. గత మార్చిలో 506 మెగావాట్ల డిమాండ్ నమోదైందని గుర్తుచేశారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులు, వ్యవసాయ, గృహ అవసరాల కారణంగా విద్యుత్ వినియోగం పెరిగిందని వివరించారు. వోల్టేజీ సమస్యల పరిష్కారానికి హైదరాబాద్ నుంచి 17 యూనిట్ల 2 ఎంవీఏఆర్ కెపాసిటర్ బ్యాంకులను తెప్పించి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రామాయంపేట, దొంగల్ ధర్మారం, కుచన్‌పల్లి సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచి ఓవర్‌లోడ్ సమస్యను అధిగమించామన్నారు. అవసరమైన ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గృహ, వ్యవసాయ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, వరి సహా ఇతర పంటలు ఎండిపోకుండా అవసరమైన సరఫరా అందిస్తున్నామని ఎస్ఈ స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

సంప్రదాయ బద్ధంగా బతుకమ్మ వేడుకలు ప్రారంభం



పటాన్ చెరు, అక్టోబర్ 10, (తెలంగాణ వాణి)

పెద్దల అమావాస్య తో మొదలుకొని పది రోజుల పాటు కొనసాగే బతుకమ్మ వేడుకలు పటాన్ చెరు డివిజన్ పరిధి లోని నవ్య ది గ్రాండ్ కాలనీలో సంప్రదాయ బద్దంగా ప్రారంభం అయ్యాయి. మహిళలు ఉత్సాహంగా తమ సంప్రదాయం కు గుర్తు గా ఉన్న బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. రంగు రంగు పూలతో అలంకరించిన బతుకమ్మ లను అలకరించుకొని వచ్చి నవ్య ది గ్రాండ్ కాలనీలోనీ మల్టి పర్పస్ హాలులో రాత్రి 9 గంటల వరకు ఆడి పాడి తమ ఉత్సాహాన్ని పంచుకున్నారు. ఈ వేడుకల లో కాలనీ కమిటీ బాధ్యులు కే వి రవీందర్, వెంకట్ రెడ్డి, వికాస్, వెంకటేష్, లక్ష్మీ నారాయణ, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రిషి వర్ధన్ రెడ్డి, హరి గోపాల్, రంగయ్య నాయుడు, చరణ్, రాజశేఖర్, మూర్తీ, రాజు, రాజేష్, నరేంద్ర, సిద్దు, ఫణి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాల ఏర్పాటుతో ప్రజలకు చేరువైన పాలన

కేసీఆర్ హయాంలోనే తెలంగాణ సమగ్ర అభివృద్ధి: దాస్యం వినయ్ భాస్కర్

తెలంగాణ వాణి, ఉమ్మడి వరంగల్ బ్యూరో (అక్టోబర్ 10)

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సుభిక్షంగా ఉందని, సబ్బండ వర్గాలకు సముచిత గౌరవం కల్పించారని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు.తెలంగాణలో జిల్లాల పునర్వ్యవస్థీకరణకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, చల్ల ధర్మారెడ్డి, తాటికొండ రాజయ్య తో కలిసి సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వరకు శాంతియుత ర్యాలీ చేపట్టి, కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ గతంలో ఉన్న 10 జిల్లాలను 33 జిల్లాలుగా ఏర్పాటు చేసి పరిపాలనను





ప్రజలకు చేరువ చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రజల ఆకాంక్షలు, చరిత్రకారుల అభిప్రాయాలకు అనుగుణంగా 2021లో హనుమకొండ జిల్లాను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు.జిల్లాల ఏర్పాటుతో పాటు విద్య, వైద్యం, ఐటీ, ఉపాధి రంగాల అభివృద్ధికి కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపారని పేర్కొన్నారు. సమీకృత కలెక్టరేట్ భవనాల నిర్మాణంతో పాలనను ప్రజలకు మరింత చేరువ చేశారని తెలిపారు. అభివృద్ధిలో అగ్రగామిగా ఉన్న తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి నెడుతోందని విమర్శించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు జిల్లాల ఏర్పాటుకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా అక్టోబర్ 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్న దశాబ్ది కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు పార్టీ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ సామాజిక సేవలకు గుర్తింపుగా ముండ్లమూరి నాగూర్ రావుకి డాక్టరేట్ ప్రదానం

హైదరాబాద్ /శేరిలింగంపల్లి అక్టోబర్10 (తెలంగాణ వాణి విలేకరి)

సామాజిక సేవా రంగంలో విశేషమైన సేవలు అందిస్తూ నిరుపేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న మదీనాగూడ మై హోమ్ జువెల్ నివాసి ముండ్లమూరి నాగూర్ రావుకి యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. సమాజ అభివృద్ధికి, మానవతా విలువల పరిరక్షణకు ఆయన అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ డాక్టరేటును శనివారం చెన్నైలోని కృష్ణ గాన సభా వేదికగా యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ వారు ప్రధానం చేసినారు నాగూర్ రావు సామాజిక సేవల్లో భాగంగా ఆకలితో ఉన్న పేదలకు అన్నదానం, ఉచిత ఆరోగ్య పరీక్షల నిర్వహణ, పేదలకు150 పైగా ఉచిత కంటి శుక్లాల శస్త్రచికిత్సలకు సహకారం, పేద అనాథ విద్యార్థులకు విద్యా సహాయం, వృద్ధాశ్రమాలకు తోడ్పాటు వంటి సేవలు ప్రధానంగా ఉన్నాయి. సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలుస్తూ, అవసరమైన వారికి సహాయం అందించడమే తన సేవా లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా నాగూర్ రావు మాట్లాడుతూ నా సామాజిక సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్‌ను అందుకోవడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది. ఈ గౌరవాన్ని సమాజానికి,



మానవాళికి అంకితం చేస్తున్నాను. పేదలకు ఆకలి నుంచి ఉపశమనం కల్పించడం, ఆరోగ్య సేవలు అందించడం, విద్యార్థులకు విద్యా అవకాశాల్లో సహకరించడం, వృద్ధులకు అండగా నిలవడం వంటి సేవలను మరింత నిబద్ధతతో కొనసాగిస్తాను. సమాజానికి సేవ చేయడమే నా జీవిత ధ్యేయం" అని తెలిపారు.మానవ సేవే మాధవ సేవ సమాజ సేవే నా జీవిత ధ్యేయం అనే ఆశయంతో భవిష్యత్తులోనూ పేదలు, నిరుపేదలు మరియు అవసరంలో ఉన్నవారికి తన వంతు సహకారం అందిస్తానని నాగూర్ రావు తెలిపారు ఈ గౌరవం తన సామాజిక సేవా ప్రయాణంలో మరింత బాధ్యతతో ముందుకు సాగేందుకు ప్రేరణనిస్తుందని ఆయన పేర్కొన్నారు.



మద్దునూర్ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ దొంగలించిన దుండగులు

ఇబ్బందులకు గురవుతున్న రైతులు

జగిత్యాల /బుగ్గారం: 10 అక్టోబర్ (తెలంగాణ వాణి విలేకరి)

జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం మద్దునూరు గ్రామంలో మద్దునూరు గండి సమీపానికి దగ్గర ఉన్నటువంటి రైతుల పంట పొలాలకు సంబంధించిన ట్రాన్స్ఫార్మర్ దుండగులు దొంగలించడం కలకలం రేపింది ఒకటే నెలలో రెండోసారి దొంగిలించబడటం రైతుల ఆందోళనకు దారి తీసింది. ఇప్పటికీ రైతులకు కరువు సమయాన నీరు అందలేక ఇబ్బందులు పడుతున్నటువంటి సమయాన కరెంటు సహాయంతో పంపు చెట్లు నడిచేటువంటి పరిస్థితి ఉండగా రైతులను ఇబ్బంది చేస్తున్నటువంటి దొంగలు సరియైనది కాదంటూ రెండోసారి ట్రాన్స్ఫార్మర్ దొంగిలించ బడటం రైతులకు తీరని లోటుగా మారింది కాబట్టి వెంటనే దొంగిలించబడ్డ సంఘటన వెంటనే బుగ్గారం ఎస్ఐ శ్రీకాంత్ కు సమాచారం అందించగా పోలీస్ అధికారులు స్పందించి దొంగల కొరకై తగిన సమయం కేటాయించి వారిని పట్టుకోవడానికి సాయి శక్తుల శ్రద్ధ వహించి పట్టుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.

ఉనికి కోసమే బీఆర్ఎస్ రాజకీయ నాటకాలు!

బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ విమర్శలు



కరీంనగర్, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

కరీంనగర్‌లో ఉనికి చాటుకునేందుకే బీఆర్ఎస్ నేతలు చేరికల పేరుతో రాజకీయ నాటకాలు ఆడుతున్నారని 29వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ విమర్శించారు. శనివారం ఎస్బీఎస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సొంత పార్టీ వారినే కొత్తగా చేరుతున్నట్లు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కిసాన్‌నగర్‌లో దళితబంధు ఇళ్ల మంజూరు పత్రాల పేరుతో పేదల నుంచి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై స్పందిస్తూ, బాధితులకు నగదు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవతో నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు రవీంద్ర భూపతి, మేకల వెంకటేష్, కర్రె పద్మ అనిల్, పొన్నం మొండన్న తదితరులు పాల్గొన్నారు.

డిండి ఆయకట్టు రైతుల పంటలు ఎండుతున్నా ప్రభుత్వానికి చలనం లేదా?

అక్టోబర్ 12న తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ధర్నా



డిండి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

డిండి ప్రాజెక్టు ఆయకట్టుకు సకాలంలో సాగునీరు అందక సుమారు 15 వేల ఎకరాల్లో 30 నుంచి 40 శాతం పంటలు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని బీజేపీ నాయకులు మాధవరం నరసింహారావు, నల్లగొండ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు వానం నరేందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి సాగు చేసిన రైతుల పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. సాగునీటిని వెంటనే అందించాలని, పంట నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 12న డిండి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. నీటిపారుదల శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ దేవరకొండ నియోజకవర్గ కన్వీనర్ ఏ.టి. కృష్ణ, డిండి మండల అధ్యక్షుడు సింకారు సైదా, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి నల్లగంతుల వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి కుంభం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొండయ్య అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోసిన పోల్సాని వేణురావు, బండారి ప్రశాంత్



జమ్మికుంట, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సండేసారి మొండయ్య విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఆయన అంత్యక్రియల్లో పోల్సాని వేణురావు, గ్రామ పంచాయతీ 3వ వార్డు సభ్యుడు బండారి ప్రశాంత్ పాల్గొని పాడె మోశారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



రమణపల్లి వెంకటయ్య జన్మదిన వేడుకలు

పీఏపల్లి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

పెద్దగుమ్మడం గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ టీఎస్ పీఏపల్లి మండల అధ్యక్షుడు రమణమ్మపల్లి వెంకటయ్య జన్మదిన వేడుకలను నియోజకవర్గ ఇన్‌చార్జి పొట్ట మురళి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, వారికి అండగా నిలుస్తున్న వెంకటయ్య ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు అందుగుల సైదులు, కొమ్ము ఉదయ్, తరి గోవర్ధన్, ఏలేటి నరసింహ, మద్దిమడుగు పెద్దులు, ఆడేపు శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాజాపేటలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు



రాజాపేట, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు రాజాపేటలో సందడిగా ప్రారంభమ య్యాయి. ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా మహిళలు తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, గౌరీదేవిని భక్తిశ్రద్ధలతో పూజించారు. గ్రామంలోని మహిళలంతా ఒకచోట చేరి బతుకమ్మ పాటలు పాడుతూ, ఉత్సాహంగా ఆడిపాడారు. దూర ప్రాంతాల్లో ఉన్న మహిళలు సైతం స్వగ్రామాలకు చేరుకుని సంబరాల్లో పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

- నిమజ్జన సమయంలో భద్రతా జాగ్రత్తలు పాటించాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)



బతుకమ్మ పండుగను జిల్లా ప్రజలు ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆకాం క్షించారు. ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. నిమజ్జన సమయంలో గోదావరి, చెరువులు, కుంటలు, వాగుల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటిలోకి లోతుగా వెళ్లవద్దని, చిన్నపిల్లలను దూరంగా ఉంచాలని కోరారు. అధికారులు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

రగ్బీ పోటీల్లో రాష్ట్ర స్థాయికి నాగిరెడ్డిపేట విద్యార్థిని



నాగిరెడ్డిపేట, అక్టోబర్ 10:(తెలంగాణ వాణి ప్రతినిధి)

కామారెడ్డి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా స్థాయిలో నవీపేట్ లో నిర్వహించిన అండర్-17 బాలికల రగ్బీ పోటీల్లో నాగిరెడ్డిపేట కేజీబీవీ విద్యార్థిని యుక్తేశ్వరి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. పాఠశాల పీఈటీ శోభ ఈ విషయాన్ని తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినిని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ గీత, ఉపాధ్యాయ బృందం అభినందించారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

రాగం సుజాత యాదవ్ జయంతి సందర్భంగా మెగా బతుకమ్మ సంబరాలు

పీజేఆర్ స్టేడియంలో 5 వేల మందికి పైగా పాల్గొని సందడి



హైదరాబాద్/శేరిలింగంపల్లి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

స్వర్గీయ రాగం సుజాత యాదవ్ జయంతిని పురస్కరించుకుని చందానగర్ పీజేఆర్ స్టేడియంలో రాగం సుజాత నాగేందర్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో 5 వేల మందికి పైగా మహిళలు, విద్యార్థినులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొని బతుకమ్మ ఆటపాటలు, కోలాటాలతో సందడి చేశారు. ముందుగా సుజాత యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. మాజీ ఎంపీ, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, రఘునాథ్ యాదవ్, త్రిపురాన వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ తన భార్య సుజాత యాదవ్‌కు బతుకమ్మ పండుగ ఎంతో ఇష్టమని, ఆమె జయంతి సందర్భంగా వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. తన మిగిలిన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేస్తానని తెలిపారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

జాతీయ స్థాయి పోటీల్లో పర్వురామ్ రెడ్డికి ప్రథమ బహుమతి

మహిళల నెలసరి నొప్పుల ఉపశమన పరికరం రూపకల్పన

కోహెడ, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి విలేకరి)



సిద్దిపేట జిల్లా కోహెడ మండలం పర్వేద గ్రామానికి చెందిన కంకణాల పర్వురామ్ రెడ్డి జాతీయ స్థాయి ప్రాజెక్టు పోటీల్లో ప్రథమ బహుమతి సాధించారు. తన బృందం 'జంపర్ వైర్స్' సభ్యులతో కలిసి మహిళలు నెలసరి సమయంలో ఎదుర్కొనే కడుపునొప్పి, అసౌకర్యాన్ని తగ్గించేందుకు 'పీరియడ్ పెయిన్ రిలీఫ్ డివైస్' అనే వినూత్న పరికరాన్ని రూపొందించారు. తొలి ప్రయత్నంలోనే జాతీయ స్థాయిలో బహుమతి సాధించడంతో పర్వేద గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. పర్వురామ్ రెడ్డితో పాటు బృంద సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

సాంస్కృతిక కార్యక్రమాలకు నిలయం శ్రీ చైతన్య

- **తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు రూపం బతుకమ్మ కరస్పాండెంట్ బిడారి సతీష్**
- **శ్రీ చైతన్య పాఠశాలలో బతుకమ్మ సంబరాలు**



జగిత్యాల/వెల్గటూర్:అక్టోబర్: 10 (తెలంగాణ వాణి ఆర్ సి)

వెల్గటూర్ మండల కేంద్రంలోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలు పేర్చి విద్యార్థినులు బతుకమ్మ పాటలతో నృత్యాలు చూపరులను ఆకర్షించాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బిడారి సతీష్ మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు రూపం బతుకమ్మ అని, బతుకమ్మ పండుగ ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి బతుకమ్మ పండుగ ప్రత్యేకమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్ , కృపాకర్, వనజ, వ్యాయామ ఉపాధ్యాయురాలు సుమ, శిరీష, అనిత, స్వప్న, సువర్ణ, సాహితీ, అనూష, రంజిత,అంజలి, గౌతమి, సంధ్య, మల్లీశ్వరి, ఆండాళ్ ,రజిత, సాత్విక, సునీత తదితరులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధి సమస్యలను ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లిన నాయకత్వ బృందం



నాగారం, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)

మల్లికార్జున నగర్ కాలనీలో నెలకొన్న అభివృద్ధి సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పనపై కాలనీ నాయకత్వ బృందం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. కాలనీవాసులకు అవసరమైన వసతులు కల్పించి, సమస్యలను పరిష్కరించేందుకు సహకరించాలని కోరింది. కాలనీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తామని బృందం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, నాగార్జున, ప్రసాద్, రాజు చారి, విష్ణు, అభిలాష్, నరేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం--రాంపల్లి చౌరస్తాలో ఘోర ప్రమాదం.. యువకుడు దుర్మరణం!

జిమ్ నుంచి ఇంటికి వెళ్తుండగా గ్యాస్ లారీ వెనుక టైరు కిందపడి మృతి

కీసర, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి):



కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం--రాంపల్లి చౌరస్తా వద్ద శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గ్యాస్ లారీ వెనుక టైరు కిందపడి అఖిల్ (20) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. చేతికొచ్చిన కుమారుడు చిన్న వయసులోనే మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.వివరాల్లోకి వెళ్తే.. నాగారంలోని శివానందపురి కాలనీకి చెందిన అఖిల్ శనివారం ఉదయం జిమ్ ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. నాగారం నుంచి అహ్మద్‌గూడ వైపు వెళ్తున్న గ్యాస్ లారీ వెనుక టైరు కింద అఖిల్ పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.అఖిల్ మృతితో శివానందపురి కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు స్థానికులను కలచివేశాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

శ్రద్ధ స్ఫూర్తి కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాల్నరీర్తి కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



కీసర, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)

మేడ్చల్ జిల్లా కీసర డివిజన్-01 పరిధిలోని శ్రద్ధ స్ఫూర్తి కళాశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి విద్యార్థినులు ఆటపాటలు, కోలాటాలతో సందడి చేశారు. కీసర డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షురాలు రామిడి స్వప్న విజయ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తాడూరి రవీందర్.

కొమురవెల్లి అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)



సార్ పేరుతో దేశంలో ఓటర్లను ఓటర్ లిస్ట్ నుంచి తొలగిస్తున్న కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని రోజు కొమురవెల్లి మండల కేంద్రంలో సిఐటియు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ,తెలంగాణ రైతు సంఘం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం చేశారు ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తాడూరు రవీందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రధాన ఎన్నికల అధికా రి జ్ఞానేష్ కుమార్ బిజెపి పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ బిజెపి వ్యతిరేక ఓట్లను తొలగించాలని బిజెపి ఆర్ఎస్ఎస్ చెప్పినట్లుగా జ్ఞానేశ్ కుమార్ వ్యవహరిస్తూ దేశంలో 13 కోట్లకు పైగా ఓట్లను తొలగించి బిజెపి పార్టీ గెలిచే విధంగా చేశాడని ప్రతిపక్ష పార్టీల ఓట్లను ప్రధానంగా మైనార్టీ దళిత ఓట్లను తొలగించడమే ఆయన లక్ష్యంగా పెట్టుకున్నాడని బిజెపి పార్టీకి అనుబంధంగా పనిచేస్తున్నాడని అందుకే కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ కమిషనర్ పదవికి ఆయన అనర్హుడాన్ని తాను వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సర్ ప్రక్రియ పూర్తిగా నిలిపివేసి తీసివేసిన ఓట్లను మళ్లీ చేర్చాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం ప్రజా సంఘాల నాయకులు తేలు ఇస్తారి మ్యకల కృపాకర్ పాకనాటి బాలు మల్లం అంజయ్య గాంధారి శ్రావణ చారి ఆరుట్ల దయనదు నూకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల ఐక్యతతోనే ఆర్టీసీ ఎన్నికల్లో ఏఐటీయూసీ విజయం

మందమర్రి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించి కార్మికులు తమ ఐక్యతను చాటారని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆరు డిపోల్లోనూ ఏఐటీయూసీ విజయం సాధించడం హర్షణీయమన్నారు. ఎంప్లాయీస్ యూనియన్ కూటమిని ఓడించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు భారీగా ఖర్చు చేశారని ఆరోపించారు. కార్మికుల ప్రధాన డిమాండ్ల సాధనకు ఎంప్లాయీస్ యూనియన్ కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భీమనాధుని సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి: జిల్లా ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ టౌన్, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి విలేకరి)



పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి, నాణ్యమైన దర్యాప్తుతో నేరస్తులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల పోలీసు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ సూచనల అమలుపై సీడీఓలు, టెక్ టీమ్ రైటర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి కేసులో పక్కాగా సాక్ష్యాధారాలు సేకరించి, చార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించారు. పెండింగ్ కేసులు, ఈ-సమ్మన్లు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను త్వరగా పరిష్కరించాలని, కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్‌లో సకాలంలో నమోదు చేయాలని ఆదేశించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖైరసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ పి. శ్రీనివాస్, సీఐలు, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐ హెచ్ఓలు, సీసీటీఎన్ఎస్ రైటర్లు, టెక్ టీమ్, సీడీఓలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు యూనివర్సల్ స్కూల్ విద్యార్థులు ఎంపిక



పెద్దపల్లి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)

సుల్తానాబాద్‌లోని రైజింగ్ సన్ స్కూల్‌లో నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికల్లో యూనివర్సల్ స్కూల్ విద్యార్థులు రుచిత, అంత్ర చౌరస్య, ఆస్తా సింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 11, 12 తేదీల్లో ఆసిఫాబాద్ తెలంగాణ మోడల్ స్కూల్‌లో జరిగే పోటీల్లో వారు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మొహమ్మద్ ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అష్జల్ విద్యార్థులను అభినందించారు.

పూలను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ : మాజీ కౌన్సిలర్ బండారి



కొత్తగూడెం, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)

ప్రపంచంలోనే పూలను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ అని, ఇది తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని మాజీ కౌన్సిలర్ రుక్మాంగదర్ బండారి అన్నారు. 56వ డివిజన్‌లో ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా తొలిరోజు వేడుకలను ఆయన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూప బండారి, సౌజన్య, సుజాత, రజినీకాంత్, కాళీ తదితర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డాక్టర్ జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు ప్రారంభం

భారీగా పాల్గొన్న మహిళలు.. బతుకమ్మ పాటలతో సందడిగా వేడుకలు





కొత్తగూడెం, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)

కొత్తగూడెం, విద్యానగర్ లోని జనసేన పార్టీ కార్యాలయంలో డాక్టర్ జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ట్రస్ట్ చైర్మన్, మాజీ హెల్త్ డైరెక్టర్, జనసేన పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ గడల శ్రీనివాస రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు కొత్తగూడెం నియోజకవర్గం నుండి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా ఈ వేదికలో నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని పలువురు పేర్కొన్నారు. కార్యాలయ ప్రాంగణం బతుకమ్మ పాటలు, మహిళల సందడితో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి వచ్చిన మహిళలకు ట్రస్ట్ సభ్యులు ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

వన్‌టౌన్ సీఐ జితేందర్‌ను కలిసిన విలేకరుల బృందం



కొత్తగూడెం, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)

కొత్తగూడెం వన్‌టౌన్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జితేందర్‌ను శనివారం విలేకరుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపింది. ఈ కార్యక్రమంలో సీనియర్ రిపోర్టర్ సీమకుర్తి రామకృష్ణ, మధుబాబు, కరాటే మొగిలి, విష్ణువర్ధన్, సాంబశివరావు పాల్గొన్నారు.

సుజాతనగర్‌కు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు

హర్షం వ్యక్తం చేసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగ సీతారాములు

సుజాతనగర్, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)



సుజాతనగర్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు కావడంపై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగ సీతారాములు యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల మంజూరుకు సహకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు రఘురాం రెడ్డి, రేణుకా చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పాఠశాల ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని, ఎమ్మెల్యే చొరవతో ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.



సామాజిక కార్యకర్త పత్తేం శ్రీనివాస్‌కు గౌరవ డాక్టరేట్

చిగురుమామిడి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి విలేకరి)

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పత్తేం శ్రీనివాస్‌కు డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్ గౌరవ డాక్టరేట్ లభించింది. గత 26 ఏళ్లుగా ఆయన అందిస్తున్న సామాజిక సేవలు, విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీసేందుకు చేస్తున్న కృషిని గుర్తించి యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ అండ్ ఎక్సలెన్స్ ఈ అవార్డును ప్రకటించింది. చెన్నైలోని కృష్ణ గానసభ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రతినిధులు, ప్రముఖుల చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. శ్రీనివాస్‌కు గౌరవ డాక్టరేట్ లభించడంపై స్థానికులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు సాయి మణికంఠ విద్యార్థినులు



ధర్మారం, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)

ధర్మారం మండల కేంద్రంలోని సాయి మణికంఠ మోడ్రన్ హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు పి. హర్షిత, జి. శ్రీనిత్య రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 30న పెద్దపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి, అక్టోబర్ 10 నుంచి 12 వరకు కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో జరిగే 9వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలికల నెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. విద్యార్థినులను పాఠశాల కరస్పాండెంట్ జైన సురేష్‌కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ జైన రమాదేవి, పీఈటీ సాయికుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.


ప్రకృతి ఆరాధనకు ప్రతీక బతుకమ్మ పండుగ



పెద్దపల్లి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ అన్నారు. సుల్తానాబాద్‌లోని పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ప్రకృతిపై ప్రేమను, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను చాటుతుందన్నారు. విద్యార్థులు సంప్రదాయాలను భావితరాలకు అందించాలని సూచించారు. విద్యార్థులు బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆల్ఫా మోడల్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



గుండ్లపల్లి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

డిండి మండల కేంద్రంలోని ఆల్ఫా మోడల్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో బతుకమ్మ ఆడిస్తూ ఆనందోత్సాహాల మధ్య సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యా యురాలు భారతి మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని, పండుగ గొప్పతనాన్ని చిన్నారులు తెలుసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లులు పాల్గొన్నారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

సింగరేణి త్రీ ఇంక్లైన్ బంగ్లాస్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా మహిళల ఆటపాటలు



కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)

సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని త్రీ ఇంక్లైన్ బంగ్లాస్‌లో శనివారం ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సీహెచ్ వెంకటరమణ ముఖ్య అతిథిగా, సేవా అండ్ లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు సీహెచ్ గీతారాణి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ముందుగా పూజలు నిర్వహించి, వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం సీహెచ్ వెంకటరమణ మాట్లాడుతూ, వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చినట్లుగానే సింగరేణి కుటుంబం కూడా ఐకమత్యంతో ముందుకు సాగుతుందని అన్నారు. ఏరియా అధికారులు, వారి కుటుంబ సభ్యులు కలిసి బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో అధికారుల గృహిణులు, మహిళా కుటుంబ సభ్యులు, లేడీస్ క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలకు నృత్యాలు చేస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటారు. కార్యక్రమంలో లేడీస్ క్లబ్ కార్యదర్శి ఎం. శ్రీవాణి, అధికారులు, వారి కుటుంబ సభ్యులు, ఇతర లేడీస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పూలను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ : మాజీ కౌన్సిలర్ బండారి



కొత్తగూడెం, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)

ప్రపంచంలోనే పూలను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ అని, ఇది తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని మాజీ కౌన్సిలర్ రుక్మాంగదర్ బండారి అన్నారు. 56వ డివిజన్‌లో ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా తొలిరోజు వేడుకలను ఆయన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూప బండారి, సౌజన్య, సుజాత, రజినీకాంత్, కాళీ తదితర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులది చారిత్రక తీర్పు

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనమే ప్రధాన అజెండా: ఏఐటీయూసీ నేతలు



కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ, సీపీఐ అనుబంధ ఎంప్లాయీస్ యూనియన్ కూటమి 6,500కు పైగా ఓట్ల మెజారిటీతో విజయం సాధించడం కార్మిక ఐక్యతకు నిదర్శనమని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్ అన్నారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని శుక్రవారం కొత్తగూడెంలో డిపో సెంటర్ నుంచి బస్టాండ్ మీదుగా అమరవీరుల స్తూపం వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో సాబీర్ పాషా మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడతామని, కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం రాజీలేని పోరాటం సాగిస్తామని తెలిపారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనమే ప్రధాన అజెండాగా ఉద్యమిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఎంప్లాయీస్ యూనియన్, సీపీఐ నాయకులు భూక్యా శ్రీనివాస్, జరుపుల ఉపేందర్, విజయ్‌కుమార్, వర్మ, రాజేశ్వరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన ఎమ్మెల్యే రాఘమయి



తల్లాడ, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి):

సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాఘమయి దయానంద్ శనివారం ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కల్లూరు విలేకరిని, అన్నారుగూడెం గ్రామానికి చెందిన తుమ్మలపల్లి వెంకటయ్యను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్ శ్రీనివాసరావు, తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి, అన్నారుగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్, కల్లూరు మండలం నాయకులు పసుమర్తి చందర్రావు తదితరులు పాల్గొన్నారు

సుజాతనగర్‌కు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేయించా

- **జీవో 187 ద్వారా రూ.8.75 కోట్ల నిధులు**
- **నర్సరీ నుంచి ఇంటర్ వరకు ఉచిత ఆంగ్ల మీడియం విద్య**
- **నాలుగైదు రోజుల్లో నిర్మాణ పనులకు శంకుస్థాపన**



సుజాతనగర్, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి

) సుజాతనగర్ మండల కేంద్రానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరైందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. జీవో నంబర్ 187 ద్వారా పాఠశాల నిర్మాణం, అభివృద్ధి పనుల కోసం రూ.8.75 కోట్ల నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. శనివారం సుజాతనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా ఆంగ్ల మీడియంలో విద్యాబోధన అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర పాఠ్యప్రణాళికతో ప్రారంభించి, భవిష్యత్తులో సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టే ఆలోచన ఉందన్నారు. అత్యాధునిక సైన్స్, కంప్యూటర్ ప్రయోగశాలలు, గ్రంథాలయం, పరిపాలనా గదులు, మరుగుదొడ్లు, 97 డ్యూయల్ డెస్క్ బెంచీలు, క్రీడా మైదానాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం చిరుతిళ్లు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నాలుగైదు రోజుల్లో ప్రజాప్రతినిధుల సమక్షంలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. నాయకులగూడెం నుంచి సుజాతనగర్ వరకు కేంద్ర విద్యుత్ దీపాలంకరణతో నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. సుజాతనగర్ ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించడంతో పాటు పాత పంచాయతీ కార్యాలయ స్థలంలో నమూనా సామాజిక భవనాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక మహిళలకు గృహ పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పించేందుకు రవి, పాపారావులతో కలిసి 300 మందికి పని కల్పిస్తున్నట్లు వివరించారు. సుజాతనగర్ ప్రాంతంలో కూరగాయలు, మిర్చి సాగు అధికంగా ఉన్నందున శీతల గిడ్డంగులు, ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. సుజాతనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం కావడం, నాన్-షెడ్యూల్డ్ భూములు అందుబాటులో ఉండటంతో పారిశ్రామిక అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయన్నారు. కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుకు గతంలోనే సూత్రప్రాయ ఆమోదం లభించినప్పటికీ సాంకేతిక కారణాలు, భూసేకరణ ఆలస్యం వల్ల జాప్యం జరిగిందని పేర్కొన్నారు. పట్టువదలకుండా ప్రయత్నించి జిల్లాకు విమానాశ్రయం, పరిశ్రమలు తీసుకొస్తామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకుడు నాగ సీతారాములు, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, విద్యా శాఖ అధికారి వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ లాల్‌సింగ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు, వాసిరెడ్డి మురళి, భూక్య దస్రు, సీపీఐ మిత్రపక్షాల నాయకులు కోమారి హన్మంతరావు, జక్కుల రాములు, రామ్మూర్తి, రాజగోపాల్, వెంకటేశ్వరరావు, ధర్మారావు, అజయ్, రాజశేఖర్, జగన్, కామేష్, ఉపేందర్, శ్రావణి, అనిత, రవి, పండు, తిరుపతిరెడ్డి, బందగి, రాంప్రసాద్, భద్రరావు, భూక్య శ్రీను, వెంకట్, అనిల్, మౌలానా, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

గరీబ్‌పేటలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

87 వాహనాలకు జరిమానాలు.. 30 మద్యం సీసాలు స్వాధీనం





కొత్తగూడెం, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

ఇటీవల వరుస ఘటనలతో సమస్యాత్మక ప్రాంతంగా మారిన గరీబ్ పేట గ్రామంపై పోలీసులు దృష్టి సారించారు. చట్టాలపై అవగాహనాతో పాటుగా, చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే ఎదురయ్యే ఇబ్బందులను గ్రామస్తులకు తెలిపేందుకు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో సుజాతనగర్ మండలం గరీబ్‌పేట గ్రామంలో శనివారం తెల్లవారుజామున ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం 4 నుంచి 7 గంటల వరకు నిర్వహించిన ఈ తనిఖీల్లో సబ్ డివిజన్ పరిధికి చెందిన సుమారు 120 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 68 ద్విచక్ర వాహనాలు, 19 త్రిచక్ర వాహనాలను గుర్తించి మొత్తం 87 వాహనాలకు జరిమానాలు విధించారు. అక్రమంగా నిల్వ ఉంచిన 30 ఐఎంఎఫ్ఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆదినారాయణ గ్రామస్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, ఎన్‌డీపీఎస్ చట్టం కింద విధించే శిక్షలపై అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ రవాణా, విక్రయాల గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కోడిపందాలు, పేకాట, జూదం, మట్కా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటీపీ, యూపీఐ మోసాలు, గుర్తుతెలియని ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ శాంతిభద్రతలు, మతసామరస్య పరిరక్షణకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐలు యాసీన్, వెంకటేశ్వర్లు, ఇంద్రసేనారెడ్డి, జితేందర్, శ్రీలక్ష్మితో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఐక్య కూటమి నాయకులకు కాంగ్రెస్ నేతల సన్మానం

కార్మికులకు రెండు ఇంక్రిమెంట్లు..
ఎన్నికల నిర్వహణపై సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు



కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో కొత్తగూడెం డిపోతో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని డిపోల్లో విజయం సాధించిన ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలోని ఐక్య కూటమి నాయకులను శనివారం కొత్తగూడెం విద్యానగర్‌లోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ నేతలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు ఆళ్ల మురళి మాట్లాడుతూ గత పదేళ్ల పాలనలో ఆర్టీసీ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం కార్మికులకు రెండు ఇంక్రిమెంట్లు మంజూరు చేయడంతో పాటు ఆర్టీసీ విలీనం దిశగా చర్యలు చేపట్టడం, ప్రజాస్వామ్యబద్ధంగా గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎన్నికలు నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకుడు, సింగరేణి కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎం.డి. రజాక్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వై. శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కె. జానీ పాషా, జిల్లా కార్యదర్శులు అంతోటి పాల్, నూకల రంగారావు, భువన సుందర్‌రెడ్డి, జల్లి కిరణ్, చిరంజీవి, చారి, రమేష్, కార్పొరేటర్ కేకే శ్రీనివాస్, జల్లి శ్రీలక్ష్మి, డాక్టర్ స్వప్న, ఎం.డి. దావూద్, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ ఐక్య కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కావాలి

బీజేపీ ఆధ్వర్యంలో ఎన్రోల్మెంట్ కార్యశాల



చర్ల, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)

భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కావాలని బీజేపీ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎస్టీ మోర్చా మహిళా నాయకురాలు ఉయిక సరోజిని పిలుపునిచ్చారు. శనివారం చర్ల మండల అధ్యక్షుడు నూప రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా సరోజిని మాట్లాడుతూ, 2023 నవంబర్ 1 నాటికి డిగ్రీ లేదా తత్సమాన అర్హత పూర్తి చేసి, సంబంధిత నియోజకవర్గ పరిధిలో నివసిస్తున్న భారతీయ పౌరులు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బి. సందీప్, గునూరి రమణ, నూప లక్ష్మణ్, పి. వినయ్, పర్సిక సౌజన్య, ముత్తవరపు శ్రీనివాసాచారి, చింతూరి విశ్వనాథ్, సంతపురి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్య జీవిత గమనాన్నే మార్చివేస్తుంది

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థి నిలయానికి శ్రీనివాస గుప్త దంపతుల చేయూత



చర్ల, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి):

విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, విద్యార్థులు పట్టుదలతో చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ప్రముఖ వ్యాపారి కొప్పరపు శ్రీనివాస గుప్త అన్నారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని తన తల్లిదండ్రులు వెంకటనారాయణ, సరోజిని జ్ఞాపకార్థం భార్య రేణుకతో కలిసి చర్లలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయానికి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నిలయానికి 50 కిలోల బియ్యం, ఐదు కిలోల వంటనూనె, ఐదు కిలోల కందిపప్పు, పండ్లను పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు గోగికార్ రాంలక్ష్మణ్ సంస్థ సేవలను వివరించి, దాతలు మరింత సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంతోష్, ముదిగొండ సతీష్, బర్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అణచలేరు

ఎస్ఐఆర్ ప్రక్రియపై న్యూ డెమోక్రసీ నిరసన



చర్ల, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)

ఎస్ఐఆర్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయంటూ దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాన్ని అక్రమ అరెస్టులతో అణచలేరని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం చర్లలో నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు, కార్యకర్తలు, మేధావులు, విద్యార్థులు, యువకులను అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఓటర్లకు భరోసా కల్పించాల్సిన ప్రక్రియ గందరగోళానికి దారితీయకూడదన్నారు. ఓట్ల తొలగింపుపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని, ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మట్ట నరసింహారావు, కుంజా జోగారావు, సంతపూరి సురేష్, చిలక ప్రసాద్, లక్ష్మి, స్వాతి, రమాదేవి, సరిత తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందించిన సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి



తల్లాడ, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)

ముద్దునూరు గ్రామంలోని ప్రభుత్వ స్థలాలను సర్వే చేసి, ఇళ్లు లేని పేద దళితులకు కేటాయించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ యరమల రామ్మోహన్‌రెడ్డి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. శనివారం ఖమ్మంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి గ్రామంలోని దళిత కుటుంబాలు ఒకే ఇంట్లో పలువురు నివసిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని వివరించారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించి పేదలకు పంపిణీ చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వనిగళ్ల వెంకటేశ్వరరావు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

చితక్కొట్టిన శాంసన్, తిలక్, అయ్యర్..

రాంచీలో విండీస్ ముందు కొండంత లక్ష్యం..!



రాంచీ: రాంచీ టీ20లో భారత కుర్రాళ్లు కుమ్మేశారు. ఓపెనర్ సంజూ శాంసన్(82) మెరుపు ఆరంభాన్ని కొనసాగిస్తూ.. మిడిలార్డర్ బ్యాటర్లు ఎడాపెడా దంచేశారు. సుడిగాలి ఇన్నింగ్స్ ఆడిన ఇషాన్ కిషన్(43), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(40)లు వెస్టిండీస్ బౌలర్లను చితక్కొట్టారు. 'నేనేం తక్కువా' అన్నట్టు తిలక్ వర్మ(44 నాటౌట్) డెత్ ఓవర్లలో సిక్సర్లతో హోరెత్తించాడు. సంజూ, ఇషాన్‌ల దూకుడుతో పవర్ ప్లేలో విండీస్‌పై రికార్డు స్కోర్ బాదిన టీమిండియా.. అయ్యర్, తిలక్‌ల జోరుతో నిర్ణీత ఓవర్లలో 249 రన్స్ కొట్టింది.

టీ20 సిరీస్‌లో అదిరే బోణీ కొట్టిన భారత్.. రెండో మ్యాచ్‌లో భారీస్కోర్ చేసింది. ఫామ్ చాటుకుంటూ ఓపెనర్ సంజూ శాంసన్(82) రెండో టీ20లో సునామిలా వెస్టిండీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. యథేచ్ఛగా ఆడుతున్న శాంసన్.. 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీతో చెలరేగగా పవర్ ప్లేలో భారత్ రన్స్ కొట్టింది. అకీల్ హోసేన్ ఓవర్లో వరసగా 4, 6, 6, 4తో 22 పరుగులు పిండుకున్న సంజూ.. షెపర్డ్ వేసిన ఆరో ఓవర్లో టు బ్యాక్ బౌండరీలతో అర్ధ శతకం సాధించాడు. దాంతో పవర్ ప్లేలో 79 రన్స్ చేసింది ఇండియా. ఫలితంగా ఈ ఫార్మాట వెస్టిండీస్‌పై గతంలో అత్యధిక స్కోర్‌గా ఉన్న 72 పరుగుల రికార్డు బద్ధలైంది.

అభిషేక్ శర్మ(20) ఔటయ్యాక దూకుడు పెంచిన సంజూకు ఇషాన్ కిషన్(43) అగ్నికి వాయువులా తోడయ్యాడు. దంచికొడుతున్న ఇషాన్‌ను ఔట్ చేసిన రోస్టన్ ఛేజ్(3-24)..ఆ తర్వాతి ఓవర్లో శివం దూబే(7)ను పెవిలియన్ చేర్చాడు. కానీ, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(40), తిలక్ వర్మ(44 నాటౌట్) పిడుగల్లే విండీస్ బౌలర్లపై పడ్డారు. దాంతో.. డెత్ ఓవర్లలో వీరి వీరకొట్టుడుకు విండీస్ బౌలర్లు బలవ్వగా.. ఏకంగా 80 రన్స్ వచ్చాయి. టాపార్డర్ సమిష్టిగా రాణించడంతో నిర్ణీత ఓవర్లలో టీమిండియా వికెట్ల నష్టానికి పరుగులు చేసింది.






నేను ఏ మతాన్ని కించపరచలేదు

ఇర్ఫాన్ పఠాన్

వ్యూస్ కోసమే కొందరు ఇలా చేస్తున్నారన్న ఇర్ఫాన్ పఠాన్

తన నుంచి నేరుగా వచ్చే వార్తలను నమ్మాలని సూచన

తప్పుడు సమాచారాన్ని షేర్ చేయవద్దన్న ఇర్ఫాన్



న్యూఢిల్లీ: భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్, తన పేరుతో సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న నకిలీ వార్తలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. తాను ఏ మతాన్ని కించపరిచేలా ఎప్పుడూ మాట్లాడలేదని స్పష్టం చేశాడు. కొంతమంది కేవలం వ్యూస్ కోసం, ఎలాంటి ఆధారం లేకుండా తన పేరును వాడుకుంటూ తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో పేర్కొన్నాడు.

"నా పేరుతో ఆధారం లేకుండా, కేవలం వ్యూస్ కోసం ఫేక్ న్యూస్ సర్యులేట్ అవుతోంది. దయచేసి ఎవరూ నమ్మవద్దు, షేర్ చేయవద్దు" అని ఇర్ఫాన్ తన పోస్టులో కోరాడు. తన నుంచి అధికారికంగా సమాచారం వస్తే తప్ప, ఇతర వార్తలను విశ్వసించవద్దని అభిమానులకు విజ్ఞప్తి చేశాడు.

"నేను నా మతంతో సహా ఏ మతాన్ని కూడా ఎప్పుడూ కించపరచలేదు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మే ముందు లేదా ఇతరులకు పంపే ముందు వాస్తవాలను సరిచూసుకోవాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నాను" అని ఇర్ఫాన్ వివరించాడు. ఈ మేరకు అతడు చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది.

పదేళ్ల తర్వాత టెస్టుల్లోకి..

చెత్త రికార్డుతో నిరాశపరిచిన ఆసీస్ బ్యాటర్

దాదాపు పదేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి తిరిగొచ్చిన నిక్ మ్యాడిన్సన్

దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో 33 బంతులు ఆడి డకౌట్

టెస్టుల్లో అత్యధిక బంతులు ఆడి డకౌటైన ఆస్ట్రేలియా ఓపెనర్‌గా చెత్త రికార్డు

క్యాన్సర్‌ను జయించి పునరాగమనం చేసిన మ్యాడిన్సన్‌కు తీవ్ర నిరాశ

2016 తర్వాత మళ్లీ ఇప్పుడే టెస్టు మ్యాచ్ ఆడుతున్న ఆసీస్ బ్యాటర్



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా క్రికెటర్ నిక్ మ్యాడిన్సన్ దాదాపు పదేళ్ల తర్వాత టెస్టు క్రికెట్‌లోకి పునరాగమనం చేశాడు. అయితే, ఈ ఎమోషనల్ కమ్‌బ్యాక్ అతనికి తీవ్ర నిరాశను మిగిల్చింది. దక్షిణాఫ్రికాతో దర్బన్‌లో జరుగుతున్న తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 33 బంతులు ఎదుర్కొని పరుగులేమీ చేయకుండా డకౌట్‌గా వెనుదిరిగాడు. దీంతో ఒక చెత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు.

సౌతాఫ్రికా ఆల్‌రౌండర్ మార్కో యన్సెన్ బౌలింగ్‌లో మ్యాడిన్సన్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఫలితంగా, టెస్టు క్రికెట్‌లో అత్యధిక బంతులు ఎదుర్కొని డకౌటైన ఆస్ట్రేలియా ఓపెనర్‌గా నిలిచాడు. ఇంతకుముందు ఈ రికార్డు డేవిడ్ వార్నర్ (22 బంతులు) పేరిట ఉండేది. అంతేకాకుండా, 21వ శతాబ్దంలో ఒక టెస్ట్ ఓపెనర్ ఆడిన అత్యంత సుదీర్ఘ డకౌట్ ఇన్నింగ్స్ కూడా ఇదే కావడం గమనార్హం.

34 ఏళ్ల మ్యాడిన్సన్ చివరిసారిగా 2016 డిసెంబర్‌లో టెస్టు మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత 2025లో అతనికి వృషణాల క్యాన్సర్ నిర్ధారణ అయింది. కీమోథెరపీ తీసుకుని, వ్యాధిని జయించి మళ్లీ దేశవాళీ క్రికెట్‌లో రాణించి జట్టులోకి వచ్చాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియాకు ఆరంభంలోనే శుక్రవారం మొదలైన ఈ మ్యాచ్‌లో ఎదురుదెబ్బ తగిలింది.



బిజినెస్ Business

కియా కార్లపై అదిరిపోయే ఆఫర్..

మూడేళ్ల తర్వాత 75% బైబ్యాక్ గ్యారెంటీ!

కియా కార్లపై 'అష్యూర్డ్ బైబ్యాక్' ప్రోగ్రామ్ విస్తరణ

మూడేళ్ల తర్వాత 75 శాతం వరకు విలువ తిరిగి చెల్లించనున్న కంపెనీ

సొనెట్, సెల్టోస్, కారెన్స్ వంటి ప్రధాన మోడళ్లకు వర్తింపు

పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ వాహనాలకు ఈ స్కీమ్ అందుబాటులో

కస్టమర్లకు భవిష్యత్ విలువపై భరోసా ఇవ్వడమే లక్ష్యమన్న కియా



న్యూఢిల్లీ: ప్రముఖ కార్ల తయారీ సంస్థ కియా ఇండియా, తమ వినియోగదారులకు ఓ అద్భుతమైన అవకాశాన్ని అందిస్తోంది. తన ప్రజాదరణ పొందిన 'అష్యూర్డ్ బైబ్యాక్ ప్రోగ్రామ్' పరిధిని మరింత విస్తరించింది. ఈ పథకం కింద, కియా కారు కొనుగోలు చేసిన కస్టమర్లు తమ వాహనం రీసేల్ వాల్యూ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నిర్ణీత గడువు తర్వాత కంపెనీయే ఆ కారును తిరిగి కొనుగోలు చేసి, దాని విలువలో గణనీయమైన మొత్తాన్ని యజమానికి తిరిగి చెల్లిస్తుంది. ఈ విస్తరించిన పథకం ప్రకారం, పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ, హైబ్రిడ్ వంటి ఇంటర్నల్ కంబశ్చన్ ఇంజిన్ మోడళ్లపై మూడేళ్ల తర్వాత 75% వరకు అష్యూర్డ్ బైబ్యాక్ విలువను కియా అందిస్తోంది. అదే సమయంలో, ఎలక్ట్రిక్ వాహనాలపై మూడేళ్ల తర్వాత 70% వరకు బైబ్యాక్ విలువకు హామీ ఇస్తోంది. గతంలో సైరోస్ ఈవీ లాంచ్ సందర్భంగా 80% వరకు బైబ్యాక్ ప్రకటించినప్పటికీ, విస్తరించిన ప్రోగ్రామ్‌లో భాగంగా దీన్ని 70%కి సవరించారు. ఈ అష్యూర్డ్ బైబ్యాక్ ప్రోగ్రామ్ కియా లైనప్‌లోని సోనెట్, సైరోస్, సెల్టోస్, కారెన్స్, కారెన్స్ క్లావిస్, సొరెంటో వంటి ప్రముఖ మోడళ్లకు అందుబాటులో ఉంటుంది. అయితే, పూర్తిగా విదేశాల నుంచి దిగుమతి చేసుకునే కార్నివాల్, ఈవీ9, ఈవీ6 మోడళ్లకు ఈ పథకం వర్తించదు. వినియోగదారులు తమ అవసరాలకు అనుగుణంగా కాలపరిమితి, మైలేజ్ ఆప్షన్లను ఎంచుకోవచ్చు. ఐసీఈ మోడళ్లకు 3, 4, లేదా 5 సంవత్సరాల కాలపరిమితి ఆప్షన్లు ఉండగా, ఎలక్ట్రిక్ వాహనాలకు 3 లేదా 4 సంవత్సరాల ఆప్షన్లు ఉన్నాయి. ఏదాదికి 10,000, 15,000, లేదా 20,000 కిలోమీటర్ల మైలేజ్ పరిమితిని ఎంచుకోవచ్చు. మొత్తం ఓనర్‌షిప్ వ్యవధిలో గరిష్ఠంగా లక్ష కిలోమీటర్ల వరకు ఇది వర్తిస్తుంది.

స్టాక్ మార్కెట్‌లో భారీ ర్యాలీ..

879 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్!

రెండు రోజుల వరుస నష్టాలకు బ్రేక్

మళ్లీ 22,500 స్థాయిని దాటిన నిఫ్టీ

ఐటీ షేర్లలో పెరిగిన కొనుగోళ్లు

కలిసొచ్చిన ముడి చమురు ధరల తగ్గుదల

కనిష్ఠాల వద్ద కొనుగోళ్లకు ఆసక్తి చూపిన మదుపర్లు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. దీంతో రెండు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ఐటీ షేర్లలో కొనుగోళ్లు పెరగడం, అన్ని రంగాల్లోనూ మదుపరులు ఆసక్తి చూపించడం, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గడం మార్కెట్లకు కలిసొచ్చాయి. దీంతో సెన్సెక్స్ 879 పాయింట్లు పెరగ్గా, నిఫ్టీ మళ్లీ 22,500 స్థాయిని దాటింది. బీఎస్ఈ సెన్సెక్స్ 879.09 పాయింట్లు లాభపడి 72,472.33 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 288.65 పాయింట్లు పెరిగి 22,520.45 వద్ద స్థిరపడింది. ఇటీవల మార్కెట్లు భారీగా పడిపోవడంతో తక్కువ ధరలకు లభిస్తున్న షేర్లను కొనుగోలు చేసేందుకు మదుపరులు ఆసక్తి చూపించారు.

నిఫ్టీలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్, ఐటీసీ, ఐషర్ మోటార్స్ షేర్లు ఎక్కువగా లాభపడ్డాయి. ఐటీ షేర్లలో కొనుగోళ్ల పెరగడంతో నిఫ్టీ ఐటీ సూచీ ఇతర రంగాల కంటే మెరుగైన పనితీరు కనబరిచింది. మరోవైపు, నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ మాత్రం వెనుకబడింది.

విస్తృత మార్కెట్లలోనూ కొనుగోళ్ల జోరు కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.56 శాతం పెరగ్గా, స్మాల్‌క్యాప్ సూచీ 0.54 శాతం లాభపడింది. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడం వల్ల ద్రవ్యోల్బణం, కంపెనీల నిర్వహణ వ్యయాలపై ఒత్తిడి తగ్గుతుందనే ఆశలు మదుపర్లలో పెరిగాయి.

ఇప్పుడు మదుపరుల దృష్టి సోమవారం విడుదలయ్యే దేశీయ వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) గణాంకాలపై ఉంది. ద్రవ్యోల్బణం వివరాలు వడ్డీ రేట్లపై రిజర్వ్ బ్యాంక్ నిర్ణయాలకు సంకేతాలు ఇవ్వనున్నాయి. రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు కూడా మార్కెట్ల తదుపరి దిశను నిర్ణయించడంలో కీలకం కానున్నాయి. ముఖ్యంగా ఐటీ కంపెనీల ఫలితాలు, కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా ఆదాయం పెరుగుతుందన్న అంచనాలు ఈ రంగంపై ఆసక్తిని పెంచుతున్నాయి.

మరోవైపు, రూపాయి కూడా సానుకూలంగా కదిలింది. అంతర్జాతీయ పరిణామాలు, పెట్టుబడుల ప్రవాహంపై ఆశల మధ్య డాలర్‌తో పోలిస్తే రూపాయి సుమారు 20 పైసలు బలపడి 96.73 స్థాయికి చేరింది.

బంగారంపై ఇన్వెస్టర్ల ఫోకస్..

ఏడాదిలో 164 శాతం పెరిగిన పెట్టుబడులు!

గోల్డ్ ఈటీఎఫ్‌లలో ఏడాదిలో 164 శాతం పెరిగిన ఇన్వెస్ట్‌మెంట్లు

ఆగస్టుకు రూ.1.91 లక్షల కోట్లకు చేరిన ఫండ్లలోని ఆస్తుల విలువ

వెండి ఈటీఎఫ్‌లలోనూ రూ.86 వేల కోట్ల వరకు పెట్టుబడులు

భారత్‌లో మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్లలో పెరుగుతున్న ఇన్వెస్ట్‌మెంట్లు

యువత ప్రయాణాలు, వినోదం వంటి వాటిపై ఖర్చే చేస్తున్నారన్న వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ప్రతినిధి



న్యూఢిల్లీ: భారత్‌లో బంగారం పెట్టుబడులకు భారీగా ఆదరణ పెరుగుతోంది. గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)లో పెట్టుబడులు ఏడాది వ్యవధిలో ఏకంగా 164 శాతం పెరిగాయి. 2026 ఆగస్టు నాటికి ఈ ఫండ్లలోని ఆస్తుల విలువ రూ. 1.91 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే సమయంలో ఈ మొత్తం సుమారు రూ.72,500 కోట్లుగా ఉంది. ఎంకే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది.

పెట్టుబడిదారులు ఇప్పుడు బంగారాన్ని కేవలం ఆర్థిక అనిశ్చితి సమయంలో భద్రత ఇచ్చే సాధనంగానే కాకుండా.. పెట్టుబడుల డైవర్సిఫికేషన్‌లో భాగంగా కూడా ఉపయోగిస్తున్నారు. వెండి ఈటీఎఫ్‌లలోనూ ఆగస్టు నాటికి రూ.85 వేల కోట్ల నుంచి రూ.86 వేల కోట్ల వరకు పెట్టుబడులు ఉన్నాయి. బంగారం, వెండి వంటి విలువైన లోహాలపై పెట్టుబడులు పెరుగుతుండటంతో పాటు, పారిశ్రామిక లోహాల మార్కెట్ కూడా విస్తరిస్తోంది.

రాగి, అల్యూమినియం, జింక్ వంటి లోహాలకు నిర్మాణ రంగం, తయారీ పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి నుంచి డిమాండ్ ఉంటుంది. ఇప్పుడు విద్యుత్ వినియోగం పెరగడం, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, విద్యుత్ ప్రసార నెట్‌వర్క్‌లు, సాంకేతిక మౌలిక సదుపాయాల విస్తరణతో వీటికి మరింత డిమాండ్ ఏర్పడుతోంది.

మరోవైపు భారత్‌లో మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్లలో పెట్టుబడులు కూడా పెరుగుతున్నాయి. 2026 ఆగస్టు నాటికి వీటి ఆస్తుల విలువ రూ. 2.07 లక్షల కోట్లను దాటింది. గత ఏడాదితో పోలిస్తే దాదాపు 57 శాతం వృద్ధి నమోదైంది. ఈ విభాగంలో వరుసగా 60 నెలల పాటు పెట్టుబడుల ప్రవాహం కొనసాగింది.

వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ప్రతినిధి షీలా కులకర్ణి మాట్లాడుతూ, బంగారం డిమాండ్ స్వరూపం మారుతోందని తెలిపారు. యువత తక్కువ బరువున్న ఆభరణాలను ఎంచుకుంటూ, ప్రయాణాలు, వినోదం వంటి వాటిపై ఎక్కువగా ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. 2026 తొలి రెండు నెలల్లోనే బంగారం ధరలు 11 సార్లు కొత్త గరిష్ఠాలను నమోదు చేయడం కూడా మార్కెట్‌లో దాని ప్రాధాన్యాన్ని చూపిస్తోంది.

సవాల్‌తో కూడిన పాత్రలు లభించడం నా అదృష్టం


అదా శర్మ



యంగ్ బ్యూటీ అదా శర్మ చాలా ఏళ్ల తర్వాత కన్నడ ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న 'రామరస' చిత్రంతో ఆమె కన్నడ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ దర్శకుడు బి.ఎం. గిరిరాజ్ ఈ దైవిక ఫాంటసీ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించారు. జి సినిమాస్ ప్రొడక్షన్, సెవన్ స్టార్ మూవీస్ బ్యానర్స్‌పై గురు దేశ్‌పాండే, విక్రమ్ ఆర్య సంయుక్తంగా ఈ భారీ బడ్జెట్ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రజ్వల్ దేవరాజ్, బిగ్ బాస్ కన్నడ విన్నర్ కార్తీక్ మహేష్, హెబ్బా పటేల్, అనూష రాయ్, శరణ్, కోమల్ కుమార్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఇందులో అదా శర్మ సాక్షాత్తు దేవి పాత్రలో నటిస్తుండటం విశేషం. భారీ ప్రాజెక్ట్‌లో భాగం కావడంపై అదా శర్మ సోషల్ మీడియా వేదికగా ఓ ఎమోషనల్ పోస్ట్ పంచుకున్నారు. జాతీయ అవార్డు గ్రహీత, దర్శకులు బి.ఎం. గిరిరాజ్ గారితో కలిసి పనిచేసే అవకాశం లభించడం తన అదృష్టమని ఆమె పేర్కొన్నారు. ఈ దైవిక పాత్ర కోసం తనను ఎంపిక చేసుకున్నందుకు నిర్మాత గురు దేశ్‌పాండే, వారి బృందానికి ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వివిధ భాషల్లో విభిన్నమైన, సవాల్‌తో కూడిన పాత్రలు పోషించే అవకాశం లభిస్తున్నందుకు తాను చాలా సంతోషంగా, అదృష్టవంతు రాలిగా భావిస్తున్నా నని అదా శర్మ తన ఆనందాన్ని పంచు కున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందిన ఈ చిత్రం డిసెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది.

నితిన్ కంబ్యాక్‌పై ప్రత్యేక ఫోకస్..

'అలియాస్ రుక్మిణి' రిలీజ్ డేట్ ఫిక్స్!



టాలీవుడ్ యంగ్ హీరో నితిన్ ప్రస్తుతం ఓ మంచి విజయాన్ని అందుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. వరుస పరాజయాల తర్వాత బలమైన కంబ్యాక్ ఇవ్వాలని ప్రయత్నిస్తున్న ఆయన.. తాజాగా 'అలియాస్ రుక్మిణి' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. మురళికాంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ చిత్రంలో వైష్ణవి చైతన్య కథానాయికగా నటిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది.తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. నితిన్‌కు సంబంధించిన ఓ సింపుల్ పోస్టర్‌ను విడుదల చేస్తూ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించారు. డిసెంబర్ 4న 'అలియాస్ రుక్మిణి' చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో నితిన్ అభిమానుల్లో ఈ సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది.

ఈ సినిమాతోనైనా నితిన్ తిరిగి విజయాల బాట పడతారా? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. కథల ఎంపికలో కొత్తదనం చూపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకోవాలని చూస్తున్న నితిన్‌కు ఈ చిత్రం ఎలాంటి ఫలితాన్ని అందిస్తుందో చూడాలి. ముఖ్యంగా రొమాంటిక్ కామెడీ కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులను ఏ మేరకు మెప్పిస్తుందనేది ఆసక్తిని కలిగిస్తోంది. మరోవైపు, ఈ చిత్రానికి నేచురల్ స్టార్ నాని నిర్మాతగా వ్యవహరిస్తుండటం కూడా సినిమాపై అంచనాలు పెరగడానికి ఒక కారణంగా నిలుస్తోంది. నాని నిర్మాణంలో వస్తున్న ఈ సినిమా నితిన్ కెరీర్‌కు కీలకంగా మారే అవకాశముంది. ఇక విజయ్ బుల్గానిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

మొత్తానికి, డిసెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న 'అలియాస్ రుక్మిణి' నితిన్‌కు విజయాన్ని అందించి, ఆయన కెరీర్‌లో మరో కీలక మలుపుగా నిలుస్తుందేమో చూడాలి. ఈ సినిమాలో నితిన్ లుక్, పాత్ర స్వభావం చాలా కొత్తగా ఉండబోతున్నాయని సమాచారం. 'బేబీ' చిత్రంతో యూత్‌ను ఉర్రూతలూగించిన విజయ్ బుల్గానిన్ ఈ సినిమాకు స్వరాలు సమకూరుస్తున్నారు.

యష్ 'టాక్సిక్'కు మరో షాక్..

రూ.200 కోట్ల ఓటీటీ డీల్‌పై నీలినీడలు!



కన్నడ రాకింగ్ స్టార్ యష్‌కు 'కేజీఎఫ్' సిరీస్ ఎలాంటి గుర్తింపును తీసుకొచ్చిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సినిమాలతో దేశవ్యాప్తంగా భారీ అభిమానగణాన్ని సంపాదించుకున్న ఆయన.. తదుపరి చిత్రాల విషయంలో ఎంతో జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే దర్శకురాలు గీతూ మోహన్‌దాస్‌తో కలిసి 'టాక్సిక్' అనే భారీ పాన్ ఇండియా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అయితే ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ బిజినెస్‌పై తాజాగా పలు వార్తలు వినిపిస్తున్నాయి. 'టాక్సిక్' సినిమాపై మొదటి నుంచీ భారీ అంచనాలు నెలకొన్నాయి. యష్ చాలా కాలం తర్వాత హీరోగా నటిస్తున్న సినిమా కావడంతో అభిమానులు ఈ ప్రాజెక్టుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే సినిమా విడుదలకు ముందే డిజిటల్ హక్కుల విషయంలో భారీ మొత్తంలో బిజినెస్ జరగనుందనే ప్రచారం సాగింది.

ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 ఈ సినిమా డిజిటల్ హక్కులను దక్కించుకోనున్నట్లు వార్తలు వచ్చాయి. తొలుత ఈ ఒప్పందం విలువ సుమారు రూ.200 కోట్ల వరకు ఉండొచ్చని ప్రచారం జరిగింది. అయితే తాజా ప్రచారం ప్రకారం, సినిమా హక్కుల కోసం మొదట అనుకున్న స్థాయిలో డిమాండ్ లేదని తెలుస్తోంది. రూ.200 కోట్లుగా వినిపించిన ఓటీటీ డీల్ విలువ రూ.30 కోట్లకు తగ్గినట్లు కొన్ని కథనాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా, ఈ మొత్తం విషయంలోనూ తుది ఒప్పందం కుదిరిందా లేదా అనే దానిపై స్పష్టత లేదు. ఈ వార్తలపై చిత్రబృందం లేదా సంబంధిత ఓటీటీ సంస్థ అధికారిక ప్రకటన చేయలేదు.'కేజీఎఫ్' సినిమాల తర్వాత యష్ తన తదుపరి ప్రాజెక్ట్‌ను ప్రకటించడానికి చాలా సమయం తీసుకున్నారు. చివరకు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో 'టాక్సిక్' చిత్రాన్ని ప్రారంభించారు. విభిన్నమైన కథాంశం, భారీ నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు ప్రచారం జరిగింది. దీంతో ఈ సినిమాపై దేశవ్యాప్తంగా సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

శర్వానంద్ 'భోగి' నుంచి జానపద గీతం విడుదల..

పల్లె జీవితాన్ని కళ్లకు కట్టిన 'ఎగిలి వరంగ'



టాలీవుడ్‌లో వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్న హీరో శర్వానంద్ ఈసారి మాస్ హీరోగా తన సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. సంపత్ నంది దర్శకత్వంలో ఆయన నటిస్తున్న యాక్షన్ డ్రామా 'భోగి'పై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. ఇటీవల విడుదలైన టీజర్ సినిమాలోని యాక్షన్‌తో పాటు ఇతర అంశాలను పరిచయం చేయగా.. తాజాగా చిత్రబృందం తొలి పాటను విడుదల చేసింది. 'ఎగిలి వరంగ' పేరుతో వచ్చిన ఈ జానపద గీతం పల్లె జీవనశైలిని, అక్కడి ప్రజల సంస్కృతిని అందంగా ఆవిష్కరిస్తోంది. 'ఎగిలి వరంగ' పాటలో గ్రామీణ జీవితంలోని ఎన్నో కోణాలను చూపించారు. తెల్లవారుజామున పల్లెల్లో మొదలయ్యే సందడి, తమ తమ పనులకు వెళ్లే ప్రజలు, వారి వృత్తులు, కుటుంబాల మధ్య ఉండే అనుబంధాలు వంటి అంశాలను పాటలో పొందుపరిచారు. గ్రామంలోని పెద్దల పట్ల ప్రజలు చూపించే గౌరవం, పటేల్ పట్ల ఉండే మర్యాదను కూడా ఈ గీతం ప్రతిబింబిస్తోంది. పల్లె ప్రజలు తమ కష్టాలను లెక్కచేయకుండా రోజువారీ పనుల్లో నిమగ్నమయ్యే విధానాన్ని పాటలో సహజంగా చూపించారు. అదే సమయంలో గ్రామీణ సమాజంలో కనిపించే భూస్వామ్య పెత్తనం, అణచివేత వంటి అంశాలనూ కొన్ని దృశ్యాల ద్వారా పరిచయం చేశారు. దీంతో ఈ పాట కేవలం వినోదానికే పరిమితం కాకుండా, సినిమా కథలోని సామాజిక నేపథ్యాన్ని కూడా సూచిస్తోంది. ఈ పాటకు చంద్రబోస్ అందించిన సాహిత్యం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. పల్లె వాతావరణానికి తగిన పదాలతో ఆయన పాటకు సహజత్వాన్ని తీసుకొచ్చారు. భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం జానపద శైలికి మరింత బలాన్ని ఇచ్చింది. నల్గొండ గద్దర్ నర్సన్న కందుకూరి శంకర్ బాబు, రిలారే గోపాల్ తమ గాత్రాలతో పాటకు ప్రత్యేకమైన జోష్ తీసుకొచ్చారు.

ఇక శర్వానంద్, అనుపమ పరమేశ్వరన్ పల్లెటూరి పాత్రలకు తగ్గట్టుగా కనిపిస్తున్నారు. వారి వేషధారణ, పాటలోని గ్రామీణ నేపథ్యం సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. మరో కథానాయికగా డింపుల్ హయాతి కూడా ఈ చిత్రంలో నటిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ట్రోల్స్‌కు భయపడితే ముందుకు వెళ్లలేం.. కత్రినా కైఫ్ కీలక వ్యాఖ్యలు



సోషల్ మీడియాలో సెలబ్రిటీల బాడీ షేమింగ్, ట్రోలింగ్‌పై బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ సీరియస్ అయ్యారు. ఇటీవల ప్రసవం తర్వాత ఓ పబ్లిక్ ఈవెంట్‌లో పాల్గొన్న ఆమెపై సోషల్ మీడియాలో కొందరు దారుణమైన ట్రోల్స్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ నెగెటివ్ కామెంట్ల పట్ల ఇన్నాళ్లు మౌనంగా ఉన్న కత్రినా, ఎట్టకేలకు లండన్ వేదికగా జరిగిన ఓ కార్యక్రమంలో ట్రోల్స్‌పై స్పందించారు. కత్రినా మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో ఎవరెవరో ఏదో మాట్లాడతారని వాటిని పట్టుకుని కుంగిపోకూడదని స్పష్టం చేశారు. అలా జనాలు చెప్పినట్లే నడుచుకోవాలని చూస్తే, మన సొంత నిర్ణయాలు మనం తీసుకోలేమని చెప్పారు.

తాను కూడా ప్రతి ఒక్కరి విమర్శలను పట్టించుకుంటే ఎప్పుడో భయంతో ఆగిపోయేదాన్ని అని, జీవితంలో ముందుకు వెళ్లేదాన్ని కాదేమోనని అభిప్రాయపడ్డారు. మనల్ని అందరూ మెచ్చుకునే రోజులు కొన్ని ఉంటాయని, కానీ మనల్ని మనమే ప్రోత్సహించుకోవాల్సిన సమయాలు కూడా వస్తాయని కత్రినా తెలిపారు. మనం ఎలా ఉన్నా మనల్ని మనం ప్రేమించుకోవాలని, జీవితంలో ఎప్పుడూ ఒకేలా ఉండమని, కొన్నిసార్లు మంచి రోజులు వస్తే మరికొన్నిసార్లు కష్టాలు వస్తాయని ఆమె చెప్పుకొచ్చారు. విమర్శలను తేలికగా తీసుకోవాలని, మనపై మనకు నమ్మకం ఉండాలని కత్రినా అన్నారు.

పవర్ ఫుల్ పాత్రలో రవీనా టాండన్..

'ఏఫర్ ఆనంద్' సినిమాపై పెరిగిన అంచనాలు!



కన్నడ చిత్రసీమలో తనదైన ముద్ర వేసిన బాలీవుడ్ స్టార్ నటి రవీనా టండన్ మరోసారి శాండల్‌వుడ్‌లో సందడి చేయడానికి సిద్ధమయ్యారు. కల్ట్ క్లాసిక్ 'ఉపేంద్ర' (1999) చిత్రంతో కన్నడ ప్రేక్షకులను అలరించిన ఆమె, ఆ తర్వాత పాన్ ఇండియా స్థాయిలో ప్రకంపనలు సృష్టించిన 'కేజీఎఫ్: చాప్టర్ 2' తో బాక్సాఫీస్ వద్ద తన స్టామినా ఏంటో మరోసారి నిరూపించుకున్నారు. ఇక ఇప్పుడు నాలుగేళ్ల తర్వాత రవీనా తన నటనకు మరింత ప్రాధాన్యత ఉన్న మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో కన్నడ తెరపై కనిపించబోతున్నట్లు సమాచారం. కన్నడ స్టార్ హీరో శివరాజ్‌కుమార్ ప్రధాన పాత్రలో, టాలెంటెడ్ డైరెక్టర్ ఎం.జి. శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఏ ఫర్ ఆనంద్' . ఇదివరకే వీరిద్దరి కాంబోలో వచ్చిన 'ఘోస్ట్' మూవీ సూపర్ హిట్‌గా నిలవడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ సినిమాలో రవీనా టండన్ అత్యంత పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రత్యేకించి, రవీనా టండన్, శివన్న స్క్రీన్ షేర్ చేసుకోబోతుండటం ఇదే తొలిసారి కావడం విశేషం.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com